ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

బుధవారం 11 డిసెంబరు 2024

సామాజిక పింఛన్ల తనిఖీ

- వైసీపీ హయాంలో అనర్హులకు మంజూరుపై ఫిర్యాదులు
- ఇంటింటా సర్వేకు కూటమి ప్రభుత్వం నిర్ణయం
- జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా పురుషోత్తపురం ఎంపిక
- లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పలు వివరాలు సేకరణ
- పర్యవేక్షించిన డీఆర్‌డీఏ పీడీ, డీఎల్‌డీవో

- 8వ పేజీలో

అన్నదాత కలవరం!

అల్పపీడనం ప్రభావంతో మారిన వాతావరణం

- వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన
- రెండు, మూడు రోజులపాటు వరి కోతలు వాయిదా వేసుకోవాలని అధికారులు సూచన
- ఇప్పటికే కోత కోసిన పొలాల్లో ఆదరాబాదరాగా కుప్పలు
- ప్రభుత్వ యాంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన కలెక్టర్
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



చోడవరం మండలం ఖండేపల్లిలో కోత కోసి కుప్ప వేయని వరి పనలు

అనకాపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): **వరి రైతులతో ప్రకృతి దోబూచులాడుతున్నది. పంట చేతికి వస్తున్న తరుణంలో బంగాళా ఖాతంలో ఏర్పడుతున్న అల్ప పీడనాలు.. వాయుగుండాలు/ తుఫాన్లుగా బలపడు తుండడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నది. రోజుల తరబడి ఆకాశం మేఘావృతంగా వుండడం, వర్షాలు సైతం కురుస్తుండడంతో వరి కోతలు కోయడానికి ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సి వస్తున్నది. వ్యవసాయ శాఖ అధికారులు సైతం వరి కోతలను వాయిదా వేసుకోవాలని చెబుతున్నారు.**

గత నెలలో ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో దాదాపు వారం రోజులపాటు వరి కోతలు ఆగిపోయాయి. వారం రోజుల నుంచి వాతావరణం అనుకూలంగా వుండడంతో రైతులు వరి కోతలు మొదలుపెట్టారు. మళ్లీ ఇంతలోనే నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావంతో జిల్లాలో మంగళవారం సాయంత్రం నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశం వుందని వాతావరణ శాఖ ప్రకటించడంతో వరి రైతులు కలవరం చెందుతున్నారు. గత నాలుగైదు రోజుల నుంచి వరి పంట కోసిన పొలాల్లో వరి పనలు పూర్తిగా ఎండకపోవడంతో కుప్పలు వేయలేదు. మంగళవారం నుంచి ఎండ ప్రభావం తగ్గిపోయి, ఆకాశం మేఘావృతంగా వుండడంతో పనులు ఆరడానికి మరికొంత సమయం పట్టే అవకాశం వుంది. ఈలోగా వర్షాలు కురిస్తే వరి పనలు తడిసిపోయి ధాన్యం పాడైపోయే ప్రమాదం వుందని ఆందోళన చెందుతున్నారు. మరికొంతమంది రైతులు మంగళవారం ఆదరాబాదరాగా వరి కుప్పలు వేసుకున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో లక్షా 40 వేల ఎకరాల్లో వరి సాగుచేపట్టగా, ఇంతవరకు 30-35 వేల ఎకరాల్లో మాత్రమే వరి కోతలు పూర్తయ్యాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోండి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారే అవకాశం వుందని, దీని ప్రభావంతో రానున్న రెండు, మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం వుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలను వాయిదా వేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. ఇప్పటికే కోత కోసిన వరి పనలను ఎత్తు ప్రదేశాల్లో కుప్పలుగా వేసుకొని, తడవకుండా టార్పాలిన్లు కప్పాలని సూచించారు. ఒకవేళ వర్షానికి వరి పనలు తడిసిపోతే ధాన్యం మొలకెత్తకుండా వుండడానికి ఉప్పునీటి ద్రావణాన్ని చల్లుకోవాలని చెప్పారు.

వర్ష సూచనతో అప్రమత్తం: కలెక్టర్

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. అల్పపీడనం లేదా వాయుగుండం ప్రభావం పూర్తిగా తగ్గేవరకు వరి పంట కోయ వద్దని రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో వుండి, వారికి సూచనలు, సలహాలు ఇవ్వాలని చెప్పారు. అల్పపీడనం నేపథ్యంలో కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. ఇక్కడ 08924 - 226599, 222888 ఫోన్ నంబర్లు వుంటాయని, సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటారని చెప్పారు.

సమగ్రాభివృద్ధికి బాటలు

- నేడు, రేపు కలెక్టర్లతో సీఎం సదస్సు
- హాజరు కానున్న విజయకృష్ణన్

అనకాపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ల సదస్సు అమరావతిలో సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధ, గురు వారాల్లో జరగనుంది. దీనికి హాజరయ్యేందుకు కలెక్టరు విజయకృష్ణన్ బుధవారం సాయంత్రం బయలుదేరి వెళ్లారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు అయిన సందర్భంగా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, నూతనంగా తీసుకొచ్చిన పాలసీలు, పలు ఇతర అంశాలపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు. తొలి రోజు ఆర్టీజీఎస్, వినతుల పరిష్కారం, గ్రామ, వార్డు సచివాలయాలు, వాట్సాప్ గవరెన్స్ వంటి వాటి గురించి కలెక్టర్ విజయకృష్ణన్ వివరించనున్నారు. రెండో రోజు పరిశ్రమలు, పెట్టుబడులు, మానవ వనరుల సద్వినియోగం, సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించనున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జిల్లాలో వివిధ రంగాల్లో జరిగిన ప్రగతి వివరాలు..

- జిల్లాలో సూక్ష్మ నీటి వినియోగ పథకాన్ని 3,600 హెక్టార్లలో అమలుచేయాలని లక్ష్యం కాగా 3,088 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 388 మందికి ఇప్పటికే పరికరాలు అందజేశారు.
- ఆయిల్‌పామ్ తోటల పెంపకం 1,550 హెక్టార్లు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే 413 హెక్టార్లలో మొక్కలు వేశారు.
- పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 750 గోకులాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా లబ్ధిదారుల నుంచి స్పందన అధికంగా ఉండడంతో 818 మందికి మంజూరు చేశారు.
- పల్లె పండుగ కార్యక్రమం కింద 1,152 సిమెంట్/ బీటీ రోడ్లు మంజూరయ్యాయి. వీటిలో 135 రోడ్లు పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో వున్నాయి.
- జల్‌జీవన్ మిషన్ కార్యక్రమం కింద రూ.346 కోట్ల అంచనాలతో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు పనులు జరుగుతున్నాయి.
- జిల్లాలో భారీ ప్రాజెక్టులు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నక్కపల్లిలో స్టీల్ ఫ్యాక్టరీ, బల్క్ డ్రగ్ పార్కు, అచ్యుతాపురం సెజ్‌లో ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు ఏర్పాటు కానున్నాయి. అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం క్లస్టర్లుగా ఇండస్ట్రియల్ పార్కులను అభివృద్ధి చేయనున్నారు.
- జిల్లాలో ఆరు నెలల్లో 6,643 గృహ నిర్మాణాలు చేయాలని లక్ష్యంగా పెట్టకోగా 5,610 గృహ నిర్మాణాలు పూర్తి చేశారు.

అనకాపల్లి సమీపాన హెల్త్ సిటీ

7.68 ఎకరాల్లో ఏర్పాటు

- నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీల్లో రహదారులు, కాలువలు, ఇతర అభివృద్ధి పనులకు రూ.9 కోట్లు
- మధురవాడలో స్పోర్ట్స్ కాంప్లెక్స్
- రుషికొండ బీచ్, గంభీరం జలాశయాల వద్ద వాటర్ స్పోర్ట్స్
- రుషికొండలో ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో అర్బన్ హ్యాబిటేట్ సెంటర్
- జాతీయ రహదారిని అనుసంధానిస్తూ వివిధ ప్రాంతాల్లో 15 రహదారుల నిర్మాణం
- వీఎంఆర్‌డీఏ బోర్డు సమావేశంలో కీలక నిర్ణయాలు



సమావేశంలో పాల్గొన్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): **విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) బోర్డు సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మంగళవారం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశానికి చైర్మన్ ప్రణవ్‌గోపాల్ అధ్యక్షత వహించగా, కమిషనర్ విశ్వనాథన్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ నేరుగా, పట్టణ, పురపాలక శాఖ కార్యదర్శి కన్నబాబు, విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా పాల్గొన్నారు.**

- పరవాడ విశాఖ ఫార్మా సిటీ, అచ్యుతాపురం ఆర్థిక మండలిలో పారిశ్రామిక ప్రమాదాలు తరచూ జరగడం, బాధితులను విశాఖకు తీసుకువచ్చేలోపు మరణిస్తుండడంతో అనకాపల్లిలోనే మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం అవసరం ఉందని గుర్తించారు. ఇందుకోసం ఎర్ర చెరువు వద్ద 7.68 ఎకరాలలో హెల్త్ సిటీ నిర్మాణానికి ఆమోదం తెలిపారు.
- నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీలు, నెల్లిమర్ల గ్రామ పంచాయతీలో రహదారులు, కాలువలు, ఇతర అభివృద్ధి పనులను రూ.9 కోట్లతో చేపట్టాలని తీర్మానించారు.
- అనకాపల్లి, తుమ్మపాల ప్రాంతాల్లో అక్కడి అవసరాలకు తగినట్టుగా రూ.2.68 కోట్లతో కమర్షియల్, కన్వెన్షన్ సెంటర్లు నిర్మించాలని నిర్ణయించారు.
- వీఎంఆర్‌డీఏలో కొత్తగా విలీనమైన 13 మండలాలకు మాస్టర్ ప్లాన్ రూపొందించడానికి ఆమోదించారు.
- విశాఖ నగరంలోని మధురవాడలో 2.7 ఎకరాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిర్ణయించారు. దీనిని ఒలింపిక్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మిస్తారు.
- రుషికొండ బీచ్, గంభీరం రిజర్వాయర్ వద్ద యువత కోసం వాటర్ స్పోర్ట్స్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆమోదం తెలిపారు.
- విశాఖపట్నం ... మిగతా 8వ పేజీలో

గోడకూలి ఇద్దరి మృతి



కూలిపోయిన గోడ శకలాలు

- జి.కోడూరులో విషాదం

మాకవరపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.కోడూరులో విషాదం చోటుచేసుకుంది. మంగళవారం రాత్రి గోడ కూలిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. ఈ సంఘటనకు సబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

ప్రమాదశాస్తు ఇంటి గోడ కూలీ ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటనజి.కోడూరు గ్రామంలో వెలుగుచూసింది.వివరాలు ఇలా ఉన్నాయి.మండలంలో జి.కోడూరు గ్రామంలో మంగళవారంరాత్రి 9గంటల ప్రాంతలో ఎప్పటిలాగానే వారు ఇంటి అరుగుపై

జి.కోడూరు గ్రామానికి చెందిన వేగి భీముడు(60) ఇల్లు, కొయిలాడ కాంతం(72) కుమార్తె ఇల్లు పక్కపక్కనే వున్నాయి. కొయిలాడ కాంతానికి ఇదే గ్రామంలో సొంత ఇల్లు వుంది. మంగళవారం సాయంత్రం కుమార్తె ఇంటికి వచ్చిన ఆమె రాత్రికి ఇక్కడే భోజనం చేసింది. రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఆమె, భీముడు కలిసి ఇంటి ముందు వున్న అరుగు మీద కూర్చొని మాట్లాడుకుంటున్నారు. కొద్దిసేపటి తరువాత ఎదురుగా వున్న పాత ఇంటి గోడ కూలిపోయి వీరిద్దరిపై పడింది. దీంతో కాంతం అక్కడిక్కడే మృతిచెందగా భీముడుని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ దామోదరనాయుడు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనతో జి.కోడూరులో విషాదచాయలు అలముకున్నాయి.

టీడీపీ జోష్

ఉత్సాహంగా పార్టీ సభ్యత్వ నమోదు!

- తెలుగుదేశం అభిమానులతోపాటు తటస్థులు సైతం చేరిక
- సభ్యులుగా చేరిన వారి కుటుంబాలకు పలు విధాలా భరోసా
- ప్రమాద బీమా రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంపు
- జిల్లాలో 3.5 లక్షల సభ్యత్వ నమోదు లక్ష్యం
- ఇంతవరకు 2,45,695 మంది చేరిక
- లక్ష్యాన్ని అధిగమిస్తామని నేతలు ధీమా



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు, మాజీ అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద, ఇతర నాయకులు (ఫైల్ ఫొటో)

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ ఉత్సాహంగా సాగుతున్నది. ఇప్పటికే పార్టీ సభ్యత్వం వున్న వారు రెన్యువల్ చేసుకుంటుండగా, మరెంతో మంది కొత్త సభ్యులుగా చేరుతున్నారు. టీడీపీలో సభ్యులుగా చేరిన వారికి రెండేళ్లపాటు రూ.5 లక్షల ప్రమాదం బీమా వుండడంతోపాటు పార్టీ అధికారంలో వుండడంతో తటస్థులు సైతం టీడీపీ సభ్యత్వం తీసుకోవడానికి ... మిగతా 8వ పేజీలో

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	టీడీపీ సభ్యత్వాలు
మాడుగుల	1,89,102	40,119
నర్సీపట్నం	2,12,193	44,689
అనకాపల్లి	2,13,720	36,599
ఎలమంచిలి	2,06,479	35,188
చోడవరం	2,17,484	32,394
పాయకరావుపేట	2,50,607	35,081
పెందుర్తి	3,07,594	21,625
మొత్తం	15,97,179	2,45,695

రూ.4.22 కోట్లతో సంక్షేమ వసతిగృహాల్లో వసతులు

అనకాపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం రూ.4.22 కోట్లు మంజూరు చేసింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సంక్షేమ వసతిగృహాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించకపోవడంతో హాస్టళ్లు దయనీయంగా మారాయి. కిటికీలు, తలుపులు ఊడిపోయాయి. మరుగుదొడ్లు అధ్వానంగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సంక్షేమ వసతిగృహాల్లో సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టింది. జిల్లాలో 29 వసతిగృహాల్లో మరమ్మతులకు నిధులు ఖర్చు చేయనున్నట్టు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి రాజేశ్వరి తెలిపారు.

తుమ్మపాల షుగర్స్ స్థలం కబ్జా!

- ఫ్యాక్టరీ భూమిలో రేకుల షెడ్ల నిర్మాణం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి (తుమ్మపాల) వీవీ రమణ కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీకి ఎందిన విలువైన స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. షుగర్ ఫ్యాక్టరీ నుంచి వెంకుపాలెం వెళ్లే రోడ్డు పక్కన వున్న ఖాళీ స్థలంలో ఏకంగా రేకుల షెడ్లు నిర్మిస్తున్నారు. ఇక్కడ సెంటు స్థలం రూ.12 లక్షలకుపైబడి ధర పలుకున్నది.

తుమ్మపాల సహకార చక్కెర ఫ్యాక్టరీని తెరిపించడమే కాకుండా ఆధునికీరిస్తామని 2019 ఎన్నికల ముందు హామీ ఇచ్చిన వైసీపీ నేతలు, అధికారంలోకి వచ్చిన తరువాత షుగర్ ఫ్యాక్టరీని దివాలా పరిశ్రమగా ప్రకటించారు. ఆస్తులను లిక్విడేట్ చేసేందుకు ప్రత్యేక అధికారిని నియమించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని ఫ్యాక్టరీ సభ్య రైతులు, పూర్వ ఉద్యోగులు అడ్డుకున్నారు. దీంతో ప్రభుత్వం వెనుకడుగు వేసింది. అయితే నాటి నుంచి తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ స్థలాలకు రక్షణ కొరవడింది. గతంలో వైసీపీ నాయకుల అండతో షుగర్ ఫ్యాక్టరీ స్థలంలో పాకలు వేసి వ్యాపార లావాదేవీలు సాగించారు. అప్పట్లో అనేక ఫిర్యాదులు అందడంతో కాస్త వెనక్కి తగ్గారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో షుగర్ ఫ్యాక్టరీ ఆస్తులకు రక్షణ కల్పిస్తారని అంతా భావించారు. కానీ పరిస్థితిలో ఎటువంటి మార్పు లేదు. షుగర్ ఫ్యాక్టరీ కళా వేదికకు ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో గత కొద్ది రోజులుగా రేకుల షెడ్డు నిర్మిస్తున్నారు. ఇదే క్రమంలో వెంకుపాలెం వెళ్లే రోడ్డుకు ఆనుకొని సుమారు 10 సెంట్ల ఫ్యాక్టరీ స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడ సెంటు భూమి రూ.12 లక్షల పైచిలుకు పలుకుతున్నది. కొంతమంది వైసీపీ నాయకుల అండదండలతో షుగర్ ఫ్యాక్టరీ స్థలాలను ఆక్రమిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా షుగర్ ఫ్యాక్టరీ సెక్యూరిటీ సిబ్బంది, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. రైతుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన షుగర్ ఫ్యాక్టరీ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని షేర్ హోల్డర్స్ సంఘం నాయకులు అంటున్నారు. అన్యాక్రాంతం అవుతున్న తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ ఆస్తులకు రక్షణ కల్పించాలని ఫ్యాక్టరీ షేర్ హోల్డర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొర్లె మోదినాయుడు ఆధ్వర్యంలో కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందజేశారు.



తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ స్థలంలో నిర్మిస్తున్న రేకుల షెడ్డు

టీచర్లకు బోధనేతర పనులు అప్పగించొద్దు

» పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని కె.విజయగౌరి



సమావేశంలో మాట్లాడుతున్న కోరెడ్ల విజయగౌరి

పాయకరావుపేట, డిసెంబరు 10 : ప్రభుత్వ పాఠశాలలను ప్రయోగశాలగా మార్చి ఉపాధ్యాయులకు ఊపిరి సలపనివ్వని బోధనేతర పనులను అప్పగించడం సరికాదని ఉత్తరాంధ్ర జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థిని కోరెడ్ల విజయగౌరి అన్నారు. మంగళవారం ఆమె పట్టణంతోపాటు మండలంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలను సందర్శించి, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రతీ రోజూ 50కి పైగా యాప్‌లను నిర్వహిస్తూ, అనేక కార్యకలాపాలు నిరంతరం అప్పగించి విద్యాబోధనకు తీరిక లేకుండా చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, పాఠశాలలపై వివిధ ప్రయోగాలు చేస్తూ పాఠశాలలకు స్టార్ రేటింగ్ తక్కువగా ఉందనడం భావ్యం కాదన్నారు. దీనికితోడు జీఓ నం.117తో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్‌సీ, డీఏలపై న్యాయమైన పోరాటం చేయాలన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల టీచర్ ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే రానున్నరోజుల్లో ఉద్యమాలకు అండగా నిలుస్తానని, సమస్యలపై మండలిలో గళం విప్పి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, జిల్లా కోశాధికారి జోగా రమేష్, మండల అధ్యక్షుడు కట్టా శ్రీరామచంద్రమూర్తి, సహాధ్యక్షులు కట్టా శ్రీను, కోశాధికారి గర్లంక సతీష్, గౌరవాధ్యక్షులు కోడి నానాజీ, ప్రచార కమిటీ కన్వీనర్ డి.ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.10 పీఏపీరూరల్1 మాసాహెబ్‌పేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

వరి కోతలను వాయిదా వేసుకోవాలి

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం వలన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని ఏవో ఆదినారాయణ అన్నారు. కోతలు కోస్తే కుప్పలు వేసుకోవాలన్నారు. మండలంలోని పెంటకోట, మాసాహెబ్‌పేటల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం, ప్రభుత్వ పథకాలు గురించి వివరించారు. వరి పంటకు రూ.600, అపరాలకు రూ.300 చెల్లించి పంటల ఇన్సూరెన్సు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త శ్రీహరిరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా భవానీ దీక్ష చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర ఇన్‌చార్జిగా నక్కా వెంకట్రామన్

ఎలమంచిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా భవానీ దీక్ష చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర ఇన్‌చార్జిగా ఎలమంచిలికి చెందిన నక్కా వెంకట్రామన్‌ను నియమితులయ్యారు. ఈనెల 8వ తేదీన విజయవాడలో నిర్వహించిన ఆల్ ఇండియా భవానీ దీక్షా చారిటబుల్ ట్రస్ట్ జాతీయ సదస్సులో జాతీయ అధ్యక్షుడు లంకా గణేష్ తనను నియమించినట్టు వెంకట్రామన్ తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

క్రైస్తవ పుస్తక ప్రదర్శన ప్రారంభం



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న బిషప్ బీడీ కిరణ్‌కుమార్

ఎలమంచిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగుపాలెం జాతీయ రహదారి పక్కన ఉన్న ఎల్‌ఈఎఫ్ చర్చి ఆవరణలో మంగళవారం క్రైస్తక పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని బిషప్ డాక్టర్ బీడీ కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఐదు రోజులుపాటు కొనసాగుతుందని నిర్వాహకుడు ప్రసాద్ తెలిపారు. వివిధ ప్రతులలో బైబిల్, కామెంట్రీలు, క్రైస్తవ రచనలు, భక్తుల జీవిత చరిత్రలు, బైబిల్ కథల పుస్తకాలు ఈ ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ డాక్టర్ కె. పీటర్, జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ కె. పాల్ ఇమ్మానుయేల్, బ్యూటిఫుల్ బుక్స్ మేనేజరు బ్రదర్ ఇషాక్ చెన్నై, క్రైస్తవులు పాల్గొన్నారు.

రాజయ్యపేటలో రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ అప్పలనర్స

నక్కపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట మత్స్యకార గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన కొత్త రహదారిని మంగళవారం సర్పంచ్ పిక్కి అప్పలనర్స, ఎంపీటీసీ సభ్యుడు పిక్కి సత్తియ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి పాలనలో గ్రామాల్లో మెరుగైన రహదారి నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు పిక్కి గంగరాజు, పిక్కి కోదండరావు, మడదా రాంబాబు, సిరిపల్లి అప్పలరాజు, పిక్కి పైడితల్లి, సెక్రటరీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఐదు డీలరు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మునగపాక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో రేషన్ షాపులకు డీలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తహసీల్దార్ ఆదిఉమామహేశ్వరరావు తెలిపారు. అర్హత కలిగిన వారు ఈనెల 13వ తేదీలోగా అనకాపల్లి ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రఖాస్తు చేసుకున్న వారికి 26న రాత పరీక్ష ఉంటుందని, 27న ఇంటర్వ్యూ జరుగుతుందన్నారు. ఒంపోలు(ఎస్‌టీ), వెంకటాపురంనకు (ఈడబ్ల్యూఎస్), కుమారపురం (బీసీ-డి), యాదగిరిపాలెం (బీసీ-ఈ), మడకపాలెం (బీసీ-బి) వర్గీయులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

చెరకు రైతులకు బకాయిలు చెల్లించాలి

చోడవరం, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): గోవాడ చెరకు రైతుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఏపీ చెరకు రైతుల సంఘం నాయకులు ఫ్యాక్టరీ ఎండీ వి. సన్యాసినాయుడుకు వినతిపత్రం ఇచ్చారు. చెరకు రైతులను ఆదుకోవాలని, తగిన మద్దతు ధర ఇవ్వాలని, అలా చేస్తే చెరకు సాగు పెరుగుతుందని సూచించారు.

పట్టణ రోడ్లపై పాలకుల నిర్లక్ష్యం

» ఆధునికీకరణకు నోచుకోని కొత్తపేట, డీసీసీబీ బ్యాంకు రోడ్లు » ఇబ్బంది పడుతున్న ఎలమంచిలి ప్రజలు



కొత్తపేటలో పురాతన శివాలయం రోడ్డు దుస్థితి



మట్టి దిబ్బలతో కుచించుకుపోయిన డీసీసీబీ బ్యాంకు వీధి రోడ్డు

ఎలమంచిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రోడ్ల అభివృద్ధిలో మునిసిపల్ పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పురాతన ఆలయాలతోపాటు నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే కొత్తపేట ప్రధాన రోడ్డుకు మోక్షం కల్పించడంలో అధికారులు, పాలకులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అదే ధనికులు, ప్రైవేటు పాఠశాలలు ఉన్న ప్రాంతాల్లో ఉన్న రహదారులకు మోక్షం కల్పిస్తున్న పాలకులు ప్రాధ్యాన్యత కలిగిన రోడ్లపై నిర్లక్ష్యం వహిస్తున్నారని పట్టణవాసులు విమర్శిస్తున్నారు. పట్టణంలోని కొత్తపేట ప్రాంతంలో అత్యంత పురాతనమైన రామలింగేశ్వర స్వామి సీతారాముల ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయాలకు వెళ్లే రోడ్డు ప్రజలు, భక్తులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డు రాళ్లు తేలిపోయి వాహన దారులకు చుక్కలు చూపిస్తున్నా ఏళ్ల తరబడి ఆధునికీకరణకు నోచుకోవడం లేదు. అదేవిధంగా చెంతనే డీసీసీబీ బ్యాంకు వీధి రోడ్డు రెండు వైపులా మట్టి దిబ్బలు పేరుకుపోయి రోడ్డు కుచించుకుపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు రోడ్డు బాగు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

రాంబిల్లి సంతలో పారిశుధ్యం అధ్వానం

» కోళ్ల వ్యర్థాలతో దుర్వాసన » పేరుపోతున్న చెత్త,చెదారం » పట్టించుకోని అధికారులు

రాంబిల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమీపంలో జరిగే సంత స్థలంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ఇక్కడ ప్రతీ మంగళవారం వారపు సంత జరుగుతుంది. రాంబిల్లి, పరిసర 30 గ్రామాలకు చెందినవారు ఈ సంతకు వస్తుంటారు. రాంబిల్లి, ఎలమంచిలి మండలాలకు చెందిన వ్యాపారులు సంతలో వ్యాపారాలు సాగిస్తుంటారు. ఈ సంత స్థలంలో చెత్త పేరుకుపోతున్నా సంత నిర్వాహకులు పారిశుధ్యాన్ని సక్రమంగా నిర్వహించడం లేదు. దీంతో చెత్త నిల్వలు పేరుకుపోతున్నాయని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. చేపల మార్కెట్ స్థలంలో పారిశుధ్యం మరింత దారుణంగా ఉంది. వ్యాపారులు కోళ్లు, చేపలు, మాంసం వ్యర్థాలను పక్కనే ఉన్న చెరువులో వేస్తుండడంతో అధికంగా దుర్వాసన వెదజల్లుతోంది. సంత నిర్వాహకులు మాత్రం తూతూమంత్రంగా పారిశుధ్య కార్యక్రమాలు చేస్తున్నారు తప్ప పూర్తి స్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం లేదని పలువురు వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి సంత ప్రాంగణంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.



సంత స్థలంలో వ్యాపారులు వేసిన కోళ్లు, చేపల వ్యర్థాలు

ఘనంగా సోమలింగపాలెం జంపమాంబ జాతర



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న పప్పల చలపతిరావు, మళ్ల సురేంద్ర

ఎలమంచిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని సోమలింగపాలెం గ్రామ దేవత జంపమాంబ అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారి ని భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు తదితర నేతలంతా అమ్మవారిని దర్శించుకున్నారు. వీరందరికీ స్థానిక నేతలు కర్రి ఝాన్సీ తదితరులు ఘనస్వాగతం పలికారు.

అనంతరం వీరిని ఘనంగా సత్కరించారు. బంధువుల తాకిడితో గ్రామంలోని ఇళ్లన్నీ కళకళలాడాయి. ఉత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నేల వేషాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

15 రోజుల్లో భూ సమస్యలు పరిష్కారం

» తహసీల్దార్ ఆర్.నర్సింహమూర్తి

నక్కపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి స్వీకరించిన సమస్యలను 15 రోజుల్లో పరిష్కరిస్తామని తహసీల్దార్ ఆర్.నర్సింహమూర్తి చెప్పారు. మంగళవారం స్థానిక సచివాలయంలో సర్పంచ్ నేతల జయరత్నకుమారి అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. పలువురు రైతుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ, డీటీ అన్నాజీరావు, ఆర్ఐ కన్నబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, ఉప సర్పంచ్ వీసం రాజు, అల్లాడ కొండబాబు పాల్గొన్నారు. .



నక్కపల్లి సదస్సులో అర్జీని తీసుకుంటున్న తహసీల్దార్ నర్సింహమూర్తి

రాంబిల్లిలో..

గ్రామాల్లోని భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన రజాల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 28 అర్జీలను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ త్రిమూర్తులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆర్. రవికుమార్, సర్పంచ్ పి. వరలక్ష్మి, వీఆర్‌ఓలు సూరిబాబు, బంగారయ్య పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని పెదఉప్పలం గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమేష్‌బాబు రైతుల నుంచి 67 వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, మాజీ అధ్యక్షుడు ఎస్. వెంకటరాజు, టీడీపీ నేత గుర్రం రామకృష్ణ, వీఆర్‌వో గోపీ తదితరులు పాల్గొన్నారు.



మునగపాకల: మడకపాలెం సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆదిఉమామహేశ్వరరావు

పాయకరావుపేట రూరల్‌లో..

గ్రామాలలో రెవెన్యూ సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు జి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని కుమారపురంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ వివిధ భూ సమస్యలకు సంబంధించి 39 దరఖాస్తులను స్వీకరించినట్టు తెలిపారు. వీటిని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ రాజేంద్రప్రసాద్, ఆర్ఐ త్రినాథ్, వీఆర్‌ఓలు, టీడీపీ నాయకులు సురేష్‌రెడ్డి, రావాడ గోవింద రెడ్డి, వైసీపీ నాయకులు పిరుమళ్ల రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

ప్రతీ సమస్యను 40 రోజులోపు పరిష్కరిస్తామని తహసీల్దార్ తిరుమలబాబు అన్నారు. మంగళవారం మండలంలోని పీకేపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ భూ సమస్యలపై 80 అర్జీలు వచ్చాయన్నారు. ప్రతీ సమస్యను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. ఈ సదస్సులో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మునగపాకలో..

భూ సమస్యలు పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని స్థానిక తహసీల్దార్ ఆదిఉమామహేశ్వరరావు తెలిపారు. మండలంలో మడకపాలెంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి నాలుగు అర్జీలు వచ్చాయన్నారు. ఈ సదస్సులో సర్పంచ్ జాజుల వెంకటరావు, సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

'నీటి సంఘాల ఎన్నికల్లో కూటమి మద్దతుదారులు గెలవాలి'

పాయకరావుపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : మండలంలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి మద్దతుదారుల గెలుపునకు కృషిచేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఇక్కడ జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగునీటి వనరులు అభివృద్ధి చేసేందుకు కృషి చేసే అభ్యర్థులకు మాత్రమే కూటమి మద్దతు ఇస్తుందన్నారు. నీటి సంఘాల ఎన్నికల్లో డైరెక్టర్లతోపాటు చైర్మన్ పదవులకు కూటమి మద్దతుతో పోటీ చేసే అభ్యర్థుల గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ తోట నగేశ్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, కూటమి నాయకులు లాలం కాశీనాయుడు, గొర్రెల రాజబాబు, కంకిపాటి వెంకటేశ్వరరావు, బొంది కాశీవిశ్వనాథం, మజ్జూరి నారాయణరావు, చించెలపు పద్దు, కలిగట్ల శ్రీను, జగన్నదొర, గణపర్తి దొరబాబు, కట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పాయకరావుపేటలో సమావేశమైన కూటమి నాయకులు

16న 'ప్రశాంతి'లో ఇంటర్వ్యూలు

అచ్యుతాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16 సెజ్‌లోని యెకోహామా పరిశ్రమలో ఉద్యోగాల భర్తీకి తమ కళాశాలలో ఇంటర్వ్యూలను నిర్వహిస్తోందని ప్రశాంతి విద్యాసంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ తెలిపారు. కేవలం మహిళా అభ్యర్థుల కోసం నిర్వహిస్తున్న ఈ ఇంటర్వ్యూలలో ఐటీఐ, డిప్లొమాతోపాటు ఏదైనా డిగ్రీ చదివిన అభ్యర్థులు పాల్గొనవచ్చన్నారు. 18 నుంచి 25 సంవత్సరాల వయసు కలిగి, 5.2 అడుగుల ఎత్తుతోపాటు 50 కేజీల బరువు తప్పనిసరిగా ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 97012 41753 నంబరుకు సంప్రదించాలని ఆయన తెలిపారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలి

అచ్యుతాపురం, డిసెంబరు 10: (ఆంధ్రజ్యోతి): ఈనెల 20 నుంచి మూడు రోజులపాటు నర్సీపట్నంలో జరిగే సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని అచ్యుతాపురం సీపీఎం కన్వీనర్ రొంగలి రాము పిలుపునిచ్చారు. మంగళవారం ఇక్కడ దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు కె.సోమునాయుడు, కె. రామసదాశివరావు, కర్రి అప్పారావు, సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన మార్టూరు మాజీ సర్పంచ్



ఎమ్మెల్యే విజయకుమార్ సమక్షంలో జనసేన చేరిన మార్టూరు మాజీ సర్పంచ్ రమణ

అచ్యుతాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మార్టూరు మాజీ సర్పంచ్ కట్టుమూరు వెంకటరమణ మంగళవారం జనసేనలో చేరారు. వెంకటరమణతోపాటు ఆయన అనుచరులకు కండువా కప్పి ఎమ్మెల్యే విజయకుమార్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కాకి హరీష్, జాగారపు సన్ని, త్రిమూర్తులు. నానాజీ, అప్పలరాజు చంటి, సంతోష్, పరదేశి, నానాజీరాజు, అప్పారావు, జైరాజు, రాజేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

మనకెందుకులే అనే భావన వీడాలి : ఎస్ఐ



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు మనకెందుకులే అని భావించడం వలనే వంద మంది ఉన్నా ఒక్కరిద్దరు అరాచకాలు సృష్టించగలుగుతున్నారని, అది వీడితే సమాజం సురక్షితంగా ఉంటుందని స్థానిక ఎస్.ఐ పి.ప్రసాదరావు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఐసీడీఎస్ ఎలమంచిలి ప్రాజెక్టు ఆధ్వర్యంలో బేటీ బచావో-బేటీ పడావో కింద ఒకరోజు మండల స్థాయి శిక్షణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 1972 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా గంజాయి వంటి మాదక ద్రవ్యాలను, 1930 నంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా సైబర్ నేరాలను నిరోధించవచ్చునని తెలిపారు. ప్రతి ఉద్యోగి విధులను బాధ్యతగా నిర్వహిస్తే మంచి ఫలితాలు లభిస్తాయని చెప్పారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎస్.విమలగిరి మాట్లాడుతూ 13 నుండి 19 సంవత్సరాలు వయసు వారు మనస్సును అదుపులో ఉంచుకోగలిగితే జీవితంలో అద్భుతాలు సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వేణుగోపాలరావు, సీడీపీవో ఇందిరాదేవి, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, నోడల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

16 నుంచి ధనుర్మాస పూజలు

మునగపాక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16వ తేదీ తెల్లవారు జామున ధనుస్సంక్రమణం ప్రవేశం జరుగుతుందని సీతారామ ఆలయం అర్చకులు రేజేటి వేంకట రామవరహా నరసింహాచార్యులు (రాంబాబు), రేజేటి వేంకట సత్యనారాయణాచార్యులు (నాని) తెలిపారు. ఈనెల 16వ తేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి 13వ తేదీ వరకు ప్రతి రోజు విష్ణుసహస్రనామార్చన, శ్రీరామ అష్టోత్తరం, రక్షాస్తోత్రం, అండాళ్ అమ్మవారికి కుంకుమార్చన, బాలభోగనివేదన, నీరాజన మంత్రపుష్పములు పూజలు నిర్వహిస్తామన్నారు. జనవరి 10వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం కల్పించడం జరుగుతుందన్నారు. 13న భోగి సందర్భంగా గోదాదేవి (మహలక్ష్మి ఆండాళ్) దివ్య కళ్యాణం ఉంటుందని చెప్పారు.

రబీకి పెసర, మినుము విత్తనాలు సిద్ధం

రాంబిల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రబీకి పెసర, మినుము విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని అనకాపల్లి జిల్లా వనరుల కేంద్రం ఏవో పి.విజేత తెలిపారు. మంగళవారం మర్రిపాలెం, గోకివాడ గ్రామాల్లో నిర్వహించి పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రబీలో పంటల సాగు చేసే రైతులు రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి పంటబీమా చేయించుకోవాలన్నారు. మండల ఏవో సి. సుమంత మాట్లాడుతూ.. ఈనెల 13న అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో జరిగే కిశాన్ మేళాకు రైతులు హాజరై సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో రామారావు, వీఏఏ సరోజిని, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కనకరత్నం, కుమారి, రైతులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

మునగపాక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని ఎక్సైజ్ ఎస్ఐలు వైఎల్.నాయుడు, కె.ఎస్.గణేష్ చెప్పారు. మునగపాక మెయిన్‌రోడ్డు జంక్షన్ నుంచి అరబుపాలెం వెళ్లే రోడ్డు మార్గంలో అయ్యప్పస్వామి ఆలయానికి సమీపంలో మద్యం విక్రయాలు జరుగుతున్నట్టు అందిన సమాచారం మేరకు మంగళవారం రాత్రి దాడి చేశామన్నారు. ఈ దాడిలో బొడ్డేడ వీరు అప్పారావు అనే వ్యక్తిని పది మద్యం సీసాలతో పట్టుకున్నామన్నారు. మద్యం సీసాలను సీజ్ చేసి, ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.

శ్మశాన వాటికలో నూతన భవనం

ఎస్.రాయవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం పంచాయతీ శివారు గోకులపాడులోని శ్మశాన వాటికలో రూ. మూడు లక్షలతో నూతన భవనం నిర్మిస్తున్నట్టు సర్పంచ్ కర్రి సత్యనారాయణ మంగళవారం తెలిపారు. శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తున్న సమయంలో అక్కడికి వెళ్లిన వారు కూర్చొనేందుకు వీలుగా ఈ భవనాన్ని నిర్మిస్తామన్నారు. పునాదుల తవ్వకాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వైసీపీ నేత నాగంబోయిన శ్రీనివాసరావు, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు నక్కా శ్రీనివాసు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ఏసుప్రభు బోధనలు అందరికీ ఆదర్శం

▸▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏసు ప్రభువు బోధనలు అందరికీ ఆదర్శమని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీనియర్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు మాట్లాడారు. ఈ సందర్భంగా అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రెసిడెంట్ రొంగలి మహేష్, టీడీపీ నాయకులు సబ్బవరపు రామునాయుడు, డోకల నరసింహమూర్తి, జూరెడ్డి రాము, కన్నూరు సూర్యనారాయణ, పూడి నారాయణమూర్తి, పాస్టర్స్ పెలోషిప్ ప్రెసిడెంట్ గిరిధర్, వైస్ ప్రెసిడెంట్ డీకే. రాజు, సెక్రటరీ కె. భాస్కరరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిరోధానికి కలిసి పనిచేద్దాం

రావికమతం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నిరోధించడానికి అన్ని శాఖలూ కలిసి పనిచేద్దామని సీడీపీవో జి.ఉషారాణి పిలుపునిచ్చారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో కిశోర బాలికల వికాసంపై మంగళవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు నేరమని, దీన్ని ధిక్కరించి వివాహాలు చేస్తే జరిమానాతో పాటు రెండేళ్ల జైలు శిక్ష ఉంటుందని స్పష్టం చేశారు. బాలల అక్రమ రవాణా, సైబర్ నేరాలను ఏఎస్ఐ వివరించారు. అనంతరం వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో పుష్పాదేవి, ఎంఈవో బ్రహ్మాజీ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కిశోర బాలికల రక్షణకు ప్రత్యేక కమిటీలు

గొలుగొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిశోర బాలికల వికాసం పథకం ద్వారా బాలికలకు అన్ని విధాలా రక్షణ కల్పించడానికి గ్రామాల వారీగా కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్టు సీడీపీవో శ్రీగౌరి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం గ్రామ సచివాలయ ఉద్యోగులతో కిశోర బాలికల వికాసంపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పది మంది కిశోర బాలికలతో కమిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. నెలలో నాలుగో శనివారం కిశోర బాలికల సమస్యలపై చర్చించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామారావు, ఇన్‌చార్జి ఎంఈవో మూర్తి పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తేవాలి

మాడుగుల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ, జనసేన, బీజేపీ, తదితర పార్టీల నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. బస్టాండ్ నుంచి మోదకొండమ్మ ఆలయానికి వెళ్లే మార్గం వరకూ నాయకులంతా ర్యాలీగా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నేతలు పలువురు మాట్లాడుతూ, ప్రస్తుతం ఘాట్‌రోడ్డు మీదుగా బస్సుల రాకపోకలతో మాడుగుల కేంద్రం బోసిపోతుందన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా పార్థసారథి, కాలేజీ మీదుగా కోడూరు రోడ్డుకు 40 అడుగుల గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

నేడు స్కిల్ డెవలప్‌మెంట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

మాడుగుల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాలంపల్లి పంచాయతీ కాముకూటం గ్రామంలో బుధవారం స్కిల్ డెవలప్‌మెంట్ భవన శంకుస్థాపన చేయనున్నట్టు ఎంపీడీవో కె.అప్పారావు తెలిపారు. విశాఖపట్నం గీతం యూనివర్శిటీ వారి సహకారంతో ఏర్పాటు చేస్తున్న భవనానికి స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శంకుస్థాపన చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి నాయకులు, గ్రామ పెద్దలు హాజరుకావాలని కోరారు.

పీఎం ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలి

రోలుగుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు కోరారు. మంగళవారం ఎంపీపీ కార్యాలయంలో పీఎం ఫసల్ బీమా కరపత్రాలను విడుదల చేశారు. రైతులు రబీలో పండించే తమ పంటలకు బీమా చేయించుకోవాలని కోరారు. మినుములు, పెసలు పంటలకు ఎకరాకు బీమా రూ.300 చెల్లిస్తే రూ.20వేల వరకు బీమా వర్తిస్తుందన్నారు. ఈనెల 15వ తేదీ వరకు గడువు ఉందన్నారు. కార్యక్రమంలో ఏఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


12, 13 తేదీల్లో సర్పంచులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ

చీడికాడ, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12, 13వ తేదీల్లో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, సచివాలయాల అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో హేమసుందర్రావు తెలిపారు. శిక్షణ ఉదయం 9గంటలకే ప్రారంభమవుతుందని, అధికారులు, ప్రజాప్రతినిధులు రావాలని కోరారు. ఈ రెండు రోజులు వారికి మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

పాలస్తీనాకు సంఘీభావ సభ రేపు

చోడవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దుర్మార్గ దాడిని నిరసిస్తూ, పాలస్తీనాకు సంఘీభావంగా ఈనెల 12వ తేదీన గుంటూరులో పీడీఎస్‌వో, నవయువ సమాఖ్యల ఆధ్వర్యంలో సంఘీభావ సభ నిర్వహిస్తున్నట్టు పీడీ ఎస్‌వో, నవయువ సమాఖ్య నాయకుడు అఖిల్ తెలిపారు. మంగళవారం స్థానిక గోవాడ, చోడవరం ఎస్టీ, ఎస్టీ వసతిగృహాల వద్ద గుంటూరు సభ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సభకు రాష్ట్ర పీడీ ఎస్‌వో, నవయువ సమాఖ్య సంస్థల నాయకులు ఎస్, భాస్కర్, ప్రొఫెసర్ కొత్తపల్లి రవిబాబు, ఇతర నేతలు పాల్గొంటారన్నారు. ఈ సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌వో నేతలు రామకృష్ణ, గణేశ్, శివ, టి.అర్జున్, రాజు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన సామగ్రి వితరణ



విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న గంగాధర్, సర్పంచ్

చోడవరం, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపురాజుపేట ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకానికి సామగ్రిని రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బి. నాగగంగాధర్ మంగళవారం విరాళంగా ఇచ్చారు. పిల్లలకు ఆహారం తయారు చేయడానికి అవసరమైన పాత్రలు, ఇతర సామగ్రిని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డేడ రామునాయుడు, హెచ్ఎం ప్రభాకర్, పి.సత్యనారాయణ, మళ్ల జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

గవరలకు అండగా కూటమి సర్కారు

▸▸ రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్



గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్‌ను సత్కరిస్తున్న సంఘం నాయకులు

చోడవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గవర కులస్థుల సంక్షేమానికి చంద్రబాబు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్ తెలిపారు. స్థానిక గౌరీపుత్రుల సంఘం నాయకులు మంగళవారం గంగాధర్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీసీల పట్ల చంద్రబాబు నిబద్ధత ఎంతో గొప్పదని, కార్పొరేషన్ ద్వారా సామాజిక వర్గానికి అవసరమైన పథకాలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో గౌరీపుత్ర సంఘం నాయకులు డీకే శ్రీను, డీవీ ఆర్, రత్నం గణేశ్, తనకల జగన్, ఆడారి రాజేంద్ర, డీవీఎం నాయుడు పాల్గొన్నారు.

అల్పపీడనం హెచ్చరికలతో అన్నదాతలు అప్రమత్తం

దేవరాపల్లి, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వాతావరణం అధికారుల హెచ్చరికలతో రైతులు అప్రమత్తం అయ్యారు. వరి కోతలు కోసిన పనలను కల్లాల్లో కుప్పలుగా పెడుతున్నారు. కోతలు కోయని వరి పొలాల్లో నీరు లేకుండా చూసుకుంటున్నారు. మండల వ్యవసాయాధికారి కాంతమ్మ మాట్లాడుతూ ఈనెల 11 నుంచి అల్పపీడనం నేపథ్యంలో వరి కోతలు కోయవద్దని రైతులకు సూచించారు, వరి పంట కోసినవి కుప్పలుగా వేసి తార్పాలిన్ వేసి కప్పాలన్నారు. నూర్పులు చేయరాదన్నారు.

చీడికాడలో..

వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికల మేరకు రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని స్థానిక వ్యవసాయాధికారి ఎ.కృష్ణవేణి కోరారు. మంగళవారం చీడికాడ పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో కలిసి ఆమె వరి పంటను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే వరి కోతలు కోసిన పంటను చిన్నచిన్న కుప్పలుగా ఏర్పాటుచేసి తార్పాలిన్‌లు కప్పాలని సూచించారు. అలాగే పొలంలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రావికమతంలో..

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినందున వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించిన నేపథ్యంలో మండలంలో అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది నిర్దేశించిన స్థలాల్లో అందుబాటులో ఉండాలని తహసీల్దార్ వెంకటరమణ సూచించారు. రైతులు, ప్రజలకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందించాలన్నారు. నిత్యావసర సరకులు, ఆయిల్, గ్యాస్ తగిన స్థాయిలో అందుబాటులో ఉంచాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించామన్నారు.



చీడికాడలో వరిపైరును పరిశీలిస్తున్న ఏవో కృష్ణవేణి

జీతాల కోసం పారిశుధ్య కార్మికుల ధర్నా



ఎన్టీఆర్ మినీ స్టేడియం గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

నర్సీపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అగిగర్ల రాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఎన్టీఆర్ మినిస్టేడియంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు ధర్నా చేశారు. రానున్న క్రిస్మస్, సంక్రాంతి పండలకైనా జీతాలు సకాలంలో ఇవ్వక పోవడం ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కార్మికులకు నవంబరు నెల జీతాలు ఇంకా ఇవ్వలేదన్నారు. గత ఏడాది జరిగిన సమ్మె ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, కార్మిక సంఘం నాయకులు జోగులు, బోర్రా శ్రీను, కుపరాల రాజు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలని అవగాహన ర్యాలీ



పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

నర్సీపట్నం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీఎంఆర్ సిబ్బంది, పోలీసులు ఈ కార్యక్రమం చేపట్టారు. పట్టణ పోలీస్ స్టేషన్ దగ్గర నుంచి అబీద్ సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్ వరకు ర్యాలీ సాగించారు. ఈ సందర్భంగా సీఐ జి. గోవిందరావు మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా బైక్ డ్రైవింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐ రమేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన కౌన్సిలర్ రాజేశ్



నర్సీపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబును అమరావతి క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మునిసిపాలిటీ సమస్యలు, మౌలిక సదుపాయాల కల్పన, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను సీఎం దృష్టికి తీసుకు వెళ్లారు. పురపాలక సంఘం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

గణేశ్‌ను పరామర్శించిన మాజీ మంత్రి అమర్‌నాథ్



గణేశ్‌తో మాట్లాడుతున్న అమర్‌నాథ్

నర్సీపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హిప్ రిప్లేస్‌మెంట్ ఆపరేషన్ చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్‌ను మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పరామర్శించారు. మంగళవారం పెదబొడ్డేపల్లి క్యాంప్ కార్యాలయంలో కలిసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏఎల్‌పురం సామాజిక భవనం ప్రారంభానికి చర్యలు

కృష్ణాదేవిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏఎల్‌పురంలో రూ.7 లక్షల నిర్మించిన ఎస్సీ సామాజిక భవనం ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ లోచల సుజాత తెలిపారు. ఈ భవనాన్ని మంగళవారం పరిశీలించారు. రెండు సామాజిక భవనాలు దాదాపు పూర్తయ్యాయని, వీటిని త్వరలోనే ప్రారంభిస్తామని ఈ సందర్భంగా సర్పంచ్ చెప్పారు.

సీహెచ్ నాగాపురంలో పొలం పిలుస్తోంది..

కృష్ణాదేవిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని సిహెచ్.నాగాపురం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కె.సుధారాణి వరి పొలాలను పరిశీలించారు. ప్రస్తుతం వరి కోతలు చేస్తున్న సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యలమంచిలి రఘురామ్, మాజీ సర్పంచ్ కొలగాని రామారావు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన అవసరం

నర్సీపట్నం అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం వలన జరిగే అనార్థాలపై అవగాహన పెంచుకోవాలని సీడీపీవో సువార్త మేరీ కోరారు. నర్సీపట్నంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు చేస్తే ఆడ పిల్లలు శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా అనేక సమస్యలు ఎదుర్కొంటారన్నారు. బాలికలు గర్భం దాల్చే సన్నద్ధత లేకపోవడంతో పుట్టబోయే బిడ్డకు, తల్లికి ప్రాణహాని ఉంటుందని హెచ్చరించారు. గ్రామ స్థాయిలో వీటిపై అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోండి

నర్సీపట్నం అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం హెచ్చరికలతో రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అప్పారావు సూచించారు. మండలంలోని చెట్టుపల్లి, పెదబొడ్డెపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఏవో పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అలాగే రబీలో పీఎం ఫసల్ బీమా పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

నర్సీపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెదబొడ్డేపల్లిలో సోమవారం అక్రమంగా తరలిస్తున్న 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ సీఐ గోవిందరావు తెలిపారు. ఈ కేసులో వజ్రగడ గ్రామానికి చెందిన లగుడు నాని బాబును అరెస్టు చేసినట్టు చెప్పారు.

ఇద్దరు మహిళలపై కేసులు

నర్సీపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ అధికారులు 8.2 లీటర్లు నాటు సారా స్వాధీనం చేసుకొని ఇద్దరు మహిళలపై కేసులు నమోదు చేశారు. పెదబొడ్డేపల్లి గ్రామానికి చెందిన బొండల నాగమణి నుంచి మూడు లీటర్లు, రాళ్ల రత్నం నుంచి 5.2 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తుకు ముప్పు

నాతవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలతో భవిష్యత్తుకు ముప్పు వాటిల్లుతుందని ఎస్ఐ సిహెచ్.భీమరాజు హెచ్చరించారు. మన్యపురట్ల హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన అవగహన సదస్సులో ఆయన మాట్లాడుతూ గంజాయి, మద్యం జోలికి వెళ్లకూడదని చెప్పారు. అలాగే బాలికలకు వివిధ అంశాలపై ఎస్ఐ భీమరాజు సూచనలు సలహలు ఇవ్వడం జరిగింది. విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని సాధనకు కృషి చేయాలని సూచించారు.

పుత్తడిగైరంపేట వీఆర్‌పీ అక్రమాలపై విచారణ



వీఆర్‌పీ అక్రమాలపై విచారణ చేపడుతున్న డ్వామా ఏపీడీ శ్రీనివాస్

గొలుగొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం వీఆర్‌పీ అనిమిరెడ్డి రాజేశ్వరిపై మంగళవారం డ్వామా అధికారులు విచారణ చేపట్టారు. ఈ పథకం పనుల్లో పలు అవకతకలు చోటు చేసుకున్నాయని గ్రామస్థులు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం పుత్తడిగైరంపేట సచివాలయంలో ఈ విచారణ చేపట్టారు. మండలంలోని పుత్తడిగైరంపేట గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఐదేళ్లుగా వీఆర్‌పీ రాజేశ్వరి పనిచేస్తున్నారని, రైతులు చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనుల్లో పలు అవకతవకలు చోటు చేసుకున్నాయని జిల్లా కలెక్టర్‌కు గత నెలలో టీడీపీ నాయకుడు రూపల నాయుడుతో పాటు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ విచారణ నిర్వహించారు. అనంతరం డ్వామా ఏపీడీ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల సమక్షంలో విచారణ చేపట్టామని పూర్తిస్థాయి నివేదిన జిల్లా ఉన్నతాధికారులకు అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఏపీడీ రోజారాణి, ఎంపీడీవో మేరీరోజీ, ఏపీవో సూర్యామణి, సర్పంచ్ పత్తి రమణ, ఫిర్యాదుదారు నాయుడు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఆర్డీవో రమణ



రావికమతం: తోటకూరపాలెంలో అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో వీవీ రమణ

రావికమతం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నదని నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ అన్నారు. మండలంలో తోటకూరపాలెంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ, రీ సర్వేలో దొర్లిన తప్పులు, సర్వే జరగని గ్రామాలలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. తోటకూరపాలెంలో 39 దరఖాస్తులు రైతుల నుంచి వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, తహసీల్దార్ వెంకట రమణ, ఆర్ఐ సతీష్ సిబ్బంది పాల్గొన్నారు.

చోడవరంలో..

సమస్యలపై రెవెన్యూ అధికారుల అలసత్వంపై మండలంలోని జన్నవరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం జన్నవరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో గ్రామంలో రెవెన్యూ సమస్యలపై తాము ఇచ్చిన ఫిర్యాదులను సిబ్బంది పెండింగ్‌లో ఉంచడం, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తహసీల్దార్ అంబటి రామారావు దృష్టికి తీసుకు వచ్చారు. ఫిర్యాదులపై స్పందన లేకపోవడం వల్ల తమకు న్యాయం జరగడం లేదన్నారు. సదస్సులో ఇచ్చిన వాటికైనా పరిష్కారం చూపించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

రోలుగుంటలో..

మండలంలోని నిండుగొండ రెవెన్యూ సర్వే నంబరు 320ను పొరపాటున ప్రభుత్వ భూమిగా నమోదు చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు తహసీల్దార్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం వారు తహసీల్దార్ నాగమ్మకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎటువంటి లావాదేవీలు జరగకుండా ఈ సర్వే నంబరును వివాదాల జాబితాలో పెట్టడంతో రుణాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తక్షణమే దీనిపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు. డైగ్లాట్‌లో కూడా జిరాయితీకి బదులుగా పోరంబోకుగా భూమిగా పొరపాటున నమోదైందన్నారు. ఆ సర్వే నంబర్‌లో 50 నుంచి 60 మంది రైతులకు చెందిన 94 ఎకరాలు భూమికి 1బీ, అడంగల్‌లు రావడం లేదన్నారు. దీనివలన క్రయ,విక్రయాలకు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సమస్యను పరిష్కరిస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు నారాయణరావు, సుర్లబాబులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోవాడ చెరకు రైతుల బకాయిలు చెల్లించండి

▸▸ ఫ్యాక్టరీ ఎండీకి చెరకు రైతుల సంఘం నేతల వినతి



ఫ్యాక్టరీ ఎండీకి వినతిపత్రం ఇస్తున్న చెరకు రైతు సంఘం నాయకులు

చోడవరం, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): గోవాడ చెరకు రైతుల బకాయిలు చెల్లించడంతోపాటు, టన్నుకు రూ. 5వేలు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఏపీ చెరకు రైతుల సంఘం నాయకులు ఫ్యాక్టరీ ఎండీ వి. సన్యాసినాయుడుకు వినతిపత్రం ఇచ్చారు. ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసిన రైతులను ఆదుకోవాలని, తగిన మద్దతు ధర ఇవ్వాలని, అలా చేస్తే చెరకు సాగు పెరుగుతుందని సూచించారు. ఇథనాల్ ప్రాజెక్ట్ డిస్టిలరీలపై నేతలు కలెక్టర్ ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో చెరకు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి అప్పారావు, నాయకులు గండి నాయనిబాబు, బి. దేవుళ్లు, విశ్వనాధం, పెంటయ్య, ఈశ్వరరావు, తాత అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టుల వద్ద రక్షణ ఏర్పాటు చేయాలి



రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు

చోడవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీఎన్ రోడ్డులోని గోవాడ, వెంకన్నపాలెం వద్ద శిథిల కల్వర్టుల వద్ద రక్షణ ఏర్పాట్లుపై ఆర్ అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సీపీఐ కార్యకర్తలు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ప్రధాన రహదారిలో కల్వర్టుల వద్ద ఎలాంటి రక్షణ గోడలు లేకపోవడంతో పాటు, హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం వల్ల అనేకమంది ప్రమాదాల బారిన పడుతున్నారని సీపీఐ జిల్లాకార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించని పక్షంలో కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ ఆందోళనలో సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

గీత కార్మికులను ఆదుకోవాలి

చోడవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని గీత కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రదేవుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక ఎక్సైజ్ సీఐ పాపునాయుడుని కలిసి గీత కార్మికుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. గీత కార్మికులకు ఆదరణ పథకం అమలు చేయడంతోపాటు, తాటి చెట్లు నరకకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

17న మండల పరిషత్ బడ్జెట్ సమావేశం

చోడవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న మండల పరిషత్ బడ్జెట్ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వీవీ ఎస్‌జే. ఆంజనేయులు తెలిపారు. ఈ సమావేశంలో సవరణ బడ్జెట్‌తోపాటు 2025-26 సంవత్సరానికి అంచనా బడ్జెట్‌పై చర్చించనున్నామన్నారు. ఈ సమావేశానికి మండల పరిషత్ సభ్యులు హాజరుకావాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే డబ్బులు జమ



ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్న నీలవేణి

రావికమతం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతు సేవ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేస్తున్నట్టు నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి అన్నారు.మంగళవారం కొత్తకోట రైతు సేవ కేంద్రంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రైతు పక్షపాతి అని అన్నారు. రైతులు,అధికారులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి : ఏవో

మాడుగుల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో వాసుదేవరావు తెలిపారు. మంగళవారం గొటివాడ, వీరనారాయణంల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.


మండల కేంద్రంలో నాలుగురోజుల కిందట చోరీ జరిగిన షాపు


ఓ ఇంట్లో చిందరవందరగా చేసిన బీరువా (ఫైల్)


జోలాపుట్టు జలాశయం వాహన మార్గంలో నిత్యం తెరుచుకుని ఉంటున్న గేట్లు

దొంగతనాల జోరు.. జనం బేజారు

» ముంచంగిపుట్టు మండలంలో దొంగల స్వైర విహారం
» వరుస చోరీలతో ఆందోళన

ముంచంగిపుట్టు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో గత కొద్ది రోజులుగా దొంగతనాలు జోరుగా సాగుతుండడంతో జనాలు బెంబేలెత్తిపోతున్నారు. మండల కేంద్రంలో నిత్యం పోలీసులు రాత్రీ పగలు తేడా లేకుండా వాహన తనిఖీలు, రాత్రి గస్తీ ముమ్మరం చేసినా చోరీలు జరగడం చర్చనీయాంశంగా మారింది. వరుస దొంగతనాలతో స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ నెల 5వ తేదీన అర్థరాత్రి స్థానిక నాలుగు రోడ్ల సమీపంలోని కిరాణాషాప్‌లో దొంగలు చొరబడి విలువైన నిత్యావసర సామగ్రితోపాటు కొంత నగదు ఎత్తుకుపోయారు. అలాగే, ఓ కిరాణా షాప్ యజమాని ఇంటి ఆవరణలో ఉంచిన డ్రింక్ బాటిల్స్, తినుబండరాలను ఎత్తుకుపోయారు. అలాగే, అదే రోజు రాత్రి మరో రెండు షాప్‌ల్లో చోరీకి ప్రయత్నించి విఫలమైన విషయం తెలిసిందే. ఆ సంఘటన మరవక ముందే తాజాగా మూడు రోజుల కిందట రాత్రి మళ్లీ మండల కేంద్రంలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఒకే రోజు మూడు షాప్‌ల్లో, ఒక ఇంటిలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. అలాగే, గత ఆగస్టులో మండలంలోని వనుగుమ్మ సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ రెయ్యల పురుషోత్తం తన స్వగ్రామం లక్ష్మీపురంలోని ఇంటికి సాయంత్రం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మార్గం మధ్యలో బరడ, లబ్బూరు గ్రామాల సమీపాన డైనిజోల్లా ఘాట్‌పై ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఆయనను నిలిపి తుపాకీతో బెదిరించి అతని వద్ద నుంచి ద్విచక్ర వాహనం బలవంతగా లాక్కొని పరారయ్యారు. అదే నెలలో మండల కేంద్రంలో రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. అలాగే. ఇటీవల మావకరం సమీపంలో రాత్రి ఎనిమిది గంటల సమయంలో బైక్‌పై వస్తున్న ఆ గ్రామ సర్పంచ్ గంగాధర్‌ను దారి దోపిడీ దొంగలు తుపాకులతో బెదిరించి బైక్‌తోపాటు డబ్బులను ఎత్తుకుపోయేందుకు ప్రయత్నించారు. ఇదే సమయంలో వాహనదారుల రాకతో పరారయ్యారు. అంతకు ముందు జోలాపుట్టు మార్గంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి గుర్తుతెలియని వ్యక్తులు కత్తులు చూపి సూమారు రూ. 5వేలు తీసుకుపారిపోయారు. గతంలో సైతంమాకవరంలో తుపాకులతో రాత్రి వేళ ఓ ఇంట్లోకి దుండగులు ప్రవేశించి లూటీ చేశారు. అయితే,చిన్నపాటి చోరీలపై పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయడంలేదు. పెద్ద దొంగతనమైతేనే బాధితులు ఫిర్యాదు చేస్తున్నారు. స్థానిక పోలీసులు దొంగతనాలపై కేసులు నమోదు చేస్తున్నా ఆశించిన స్థాయిలో దర్యాప్తు చేపట్టడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే అదనుగా దొంగలు రెచ్చిపోతున్నారు. చోరీల అదుపునకు పోలీసులు పూర్తి స్థాయిలో దృష్టి సారించాల్సిఉంది.

సరిహద్దు జలాశయాలపై కానరాని గస్తీ

ఆంధ్ర- ఒడిశా రాష్ట్రాలను కలిపే జోలాపుట్టు, డుడుమ జలాశయాల వద్ద గస్తీ కానరావడంలేదు. ఆయా జలాశయాల వద్ద ప్రాజెక్టుకు సంబంధించిన సెక్యూరిటీ గార్డులు నిరంతరం గస్తీ నిర్వహించాల్సి ఉంది. అలాగే అటుగా రాకపోకలు సాగించే వాహనాల నెంబర్లను, ఇతర వివరాలను రికార్డు చేయాలి. రాత్రి వేళల్లో మరింత అప్రమత్తం అవసరం. జలాశయాల వద్ద వాహన తనిఖీలు సక్రమంగా జరగడంలేదు. అలాగే అటుగా రాకపోకలు సాగించే వాహనాల వివరాలను సైతం రికార్డు చేయడం లేదు. ఇదే అదునుగా దొంగలు తమ పనిని సులువుగా చేసుకొని ఆయా జలాశయాల మీదుగా ఒడిశావైపు వెళ్లిపోతున్నట్లు తెలుస్తోంది.

ఆంధ్రలో చోరీ.. ఒడిశాకు పరారీ

ఇటీవల మండలంలోని మాకవరంలో భారీ చోరీ చేసిన దొంగల ముఠా చోరీ అనంతరంకత్తులు, తుపాకులతో ఒక వాహనంపై డుడుమ జలాశయంపై నుంచే ఒడిశావైపు వెళ్లినట్టు సమాచారం.గతంలో సైతం ఒడిశాకు చెందిన ద్విచక్ర వాహన దొంగల ముఠా వివిధప్రాంతాల్లో సుమారు 18 ద్విచక్ర వాహనాలను ఎత్తుకుపోయిన విషయం తెలిసిందే. అయితే అప్పట్లో ముంచంగిపుట్టు పోలీసులు చాకచక్యంగాఒడిశాకు చెందిన ఈ ముఠాను పట్టుకున్నారు. ఆ సంఘటన మరవకముందే మరో సారి దొంగలు వరుస చోరీలతో రెచ్చిపోతున్నారు. ఈ స్థితిలో ఇరు రాష్ట్రాల పోలీసులు చోరీలను అరికట్టడానికి పక్కాగా చర్యలు తీసుకోవాలని మండల వాసులు డిమాండ్ చేస్తున్నారు.

అడ్డుకునేందుకు ప్రత్యేక నిఘా



మండలంలో దొంగతనాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఇటీవల జరిగిన దొంగతనాలపై ముమ్మర దర్యాప్తు కొనసాగుతోంది. జోలాపుట్టు, సంగడ జలాశయాలపై వాహన తనిఖీలు సక్రమంగా జరిగే విధంగా ప్రాజెక్టు అధికారులతో మాట్లాడతాం. ప్రజలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు.

\- జె.రామకృష్ణ, ఎస్ఐ, ముంచంగిపుట్టు

ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం


డైరెక్టర్ గణేష్‌ను సత్కరిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

పాడేరురూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత ప్రజల ఇలవేల్పు పాడేరులోని మోదకొండమ్మను దర్శించుకునేందుకు మంగళవారం రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేష్ వచ్చారు. ఆయనకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొర్రా నాగరాజు తన ఛాంబర్‌కు సాదరంగా ఆహ్వానించారు. గణేష్ పాడేరు పర్యటనకు వస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న నాగరాజు అమ్మవారి ఆలయం వద్ద ఆయనను కలిశారు. దర్శనం అనంతరం ఆయన ఛాంబర్‌కు తీసుకువెళ్లి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అనకాపల్లి జిల్లా అధికార ప్రతినిధి పరవాడ సురేష్, రాష్ట్ర ప్రొఫెషనల్ వింగ్, టీడీపీ కార్యకర్త లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

13న రైతు ఉద్యమ బాట


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో ఈ నెల 13న చేపట్టనున్న రైతు ఉద్యమబాటలో వైసీపీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం ఆ పార్టీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులతో సమావేశమై మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలనలో వైఫల్యంతోనే రైతులకు కనీస మద్దతు ధర లభించడంలేదని ఆరోపించారు.అన్నదాతలను ఆదుకోవడానికి వైసీపీ ఉద్యమబాట ద్వారా అన్నివిధాలుగా న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలించాలని ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం ఎంపీడీవో మొండిగెడ్డ గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సచివాలయంఉద్యోగులు ఉదయం, సాయంత్రం హాజరు నమోదు చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఈవోఆర్డీ పాపారావు, పీఆర్ ఏఈఈ జ్యోతిబాబు, కార్యదర్శి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

పీవీటీజీ గ్రామాల్లో రోడ్లు నిర్మించాలి


కొంత్రాయిగుడలో మాట్లాడుతున్న సుంకరమెట్ట సర్పంచ్ చినబాబు

అరకులోయ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జన్మన్ పథకం కింద పీవీటీజీ గ్రామాల్లో గృహాలతోపాటు గ్రామ రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మండల గిరిజన సంఘం కార్యదర్శి, సుంకరమెట్ట గ్రామ సర్పంచ్ గెమ్మెలి చినబాబు డిమాండ్ చేశారు. మంగళవారం అరకులోయలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తన పంచాయతీ పరిధిలో అధికశాతం పీవీటీజీ గిరిజన కుటుంబాలున్నాయన్నారు.వీరందరికీ కేంద్రం జనమ్మన్ పథకం కింద పక్కా ఇళ్లు మంజూరయ్యాయన్నారు. అయితే గ్రామాలకు రహదారులులేక ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన మెటీరియల్ తరలించడం కష్టతరంగా మారుతోందన్నారు. ఈ స్థితిలో ముందుగా రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని చినబాబు డిమాండ్ చేశారు. వాస్తవానికి పీఎం జన్మన్ పథకం కింద ప్రతీ పీవీటీజీ గ్రామాల్లో 11 రకాల మౌలిక సదుపాయాలు కేంద్రం నిధులు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఉన్నతాధికారులు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి జన్మన్ నిధులను గ్రామాల్లో పూర్తిస్థాయి అభివృద్ధి పనులకు వినియోగించాలని కోరారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

» మండల సమావేశంలో ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

కొయ్యూరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు హెచ్చరించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కమీషన్లకు కక్కుర్తిపడే ఎమ్మెల్యేని తాను కాదని, ప్రజా సమస్యలు పరిష్కారమే తనకు ముఖ్యమని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. రాజ్యాంగ బద్ధంగాఎన్నుకున్న ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ పాటించేలా చర్యలుతీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక సర్పంచులు, వార్డుల సభ్యుల ద్వారా తీర్మానాలు తీసుకోవాలన్నారు. సభ్యుల ఆధ్వర్యంలోనే ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలు తిరస్కరించిన నేతలకు నిబంధనలకు విరుద్ధంగా అందలం ఎక్కించాలని చూసే అధికారులు తగిన మూల్యం చెల్లించకతప్పదని తీవ్రస్థాయిలో ఆయన విరుచుకుపడ్డారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, ఎంపీపీ బడుగు రమేష్, వైస్ ఎంపీపీలు అంబటి నూకాలమ్మ, అప్పన్న వెంకటరమణ, ఎంపీడీవో ఎస్‌కేవి ప్రసాద్, తహసీల్దార్ ఎస్ఎల్‌వి ప్రసాద్, ఏఈలు రామకృష్ణ, సాయికృష్ణ, శ్రీవిద్య, నాగేశ్వరరావు, వైద్యాధికారి మనోజ్ఞ, అధికారులు, నాయకులున్నారు.

రాజ్యాంగ నిర్మాతా మన్నించు!

» అంబేడ్కర్ విగ్రహం ఎదుట మద్యం సీసాలు


పెదబయలులోని అంబేడ్కర్ పార్కులో మద్యం సీసాలు

పెదబయలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యంగాన్ని రచించిన గొప్ప మేధావి డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహం పరిసరాలను మందుబాబులు అపవిత్రం చేస్తున్నారు. స్థానిక ప్రధాన కూడలిలో వద్ద ఉన్న అంబేడ్కర్ పార్కులోని విగ్రహం ఎదుట మంగళవారం ఖాళీ మద్యం సీసాలు దర్శనమిచ్చాయి. దీంతో స్థానికులు మండిపడుతున్నారు. అంబేడ్కర్ పార్కులో ఇటువంటి చర్యలకు పాల్పడందారుణమని పలువురు వాపోతున్నారు. గతంలో ఎటువంటి రక్షణ లేకపోవడంతో అంబేడ్కర్ విగ్రహం పరిసరాలు అస్తవ్యస్తంగా ఉండేవి. కొద్దిరోజుల కిందట అంబేడ్కర్ అభ్యుదయ సేవ సంఘంగా కొందరు ఏర్పాటయ్యారు. వీరు నిధులు సమకూర్చి విగ్రహం చుట్టూ ప్రహరీ, పైకప్పు రేకులు వేసి లోనికి ఎవరూ ప్రవేశించకుండా గేటు ఏర్పాటు చేశారు. అయినా, మందుబాబులు బరితెగించి ప్రవేశిస్తూ మద్యం సేవించి అందులోనే ఖాళీ సీసాలను విడిచి వెళ్తున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పంచాయతీ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రూ. 4 కోట్లతో తుఫాన్ పునరావాస కేంద్రాలు


గూడెంకొత్తవీధిలో స్థలపరిశీలన చేస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెంకొత్తవీధి, సప్పర్ల గ్రామ పంచాయతీ కేంద్రాల్లో రూ. 4 కోట్లతో తుఫాన్ పునరావాస కేంద్రాలు నిర్మిస్తున్నస్తున్నట్టు తహసీల్దార్ టి. రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో తుఫాను పునరావాస కేంద్రం నిర్మాణానికి స్థల పరిశీలన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ తుఫాన్, విపత్తుల సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అనువుగా పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. సప్పర్లలో తుఫాను పునరావాస కేంద్రం నిర్మాణానికి 20సెంట్ల స్థలం కేటాయించామన్నారు. జీకేవీధిలో పరిశీలిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ దుమంతి సత్యనారాయణ, ఆర్ఐ మహదేవ్ పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ప్రచార రథానికి ఘన స్వాగతం


ప్రచార రథానికి స్వాగతం పలుకున్న భక్తులు

పాడేరురూరల్, డిసెంబరు 10 (ఆం ధ్రజ్యోతి): విజయవాడనుంచి వచ్చిన కనకదుర్గ మల్లేశ్వరి ప్రచారథానికి పా డేరులో సోమవారం రాత్రి స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి వారి సమేత రాజరాజేశ్వరి దేవి అమ్మవారి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, మోదకొండమ్మ ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో భక్తులు సాదర స్వాగతం పలికారు. ఉత్తరాంధ్ర ప్రజలకు కనకదుర్గ మల్లేశ్వరి దర్శన భాగ్యం కల్పించేందుకు ఆ ఆలయ ఈవో కేఎస్.రామారావు ఈ నెల 6వ తేదీన ఈ ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి10.30 ప్రాంతంలో పాడేరులో చేరుకున్న ఈ రథానికి పట్టణం లోని భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రథాన్ని మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో నిలిపారు. మంగళవారం ఉదయం వందలాది మంది భక్తులు కనకదుర్గ మల్లేశ్వరి దర్శనం చేపట్టారు. అనంతరం ప్రచార రథం అరకులోయకు పయనమైంది.

సమస్యలపై మాతృ భాషా ఉపాధ్యాయుల వినతి


ఐటీడీఏ పీవోకు వినతిపత్రమిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

పాడేరురూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాడేరు డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో విద్యాప్రమాణాల మెరుగుకు కృషి చేస్తున్న మాతృ బహు భాష ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స జిల్లా కార్యదర్శి పి.బాలదేవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మాతృ బహు భాషా ఉపాధ్యాయుల సంఘం నాయకులు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్‌లకు వినతిపత్రాలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాడేరు డివిజన్ పరిధిలో 676 మంది మాతృ బహు భాషా ఉపాధ్యా యులు సరైన వేతనాలు అందక ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. ఈ స్థితిలో సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతీ విద్యా సంవత్సరంలో 12 నెలలు రెన్యువల్ చేయాలని కోరామన్నారు. ఈ సమస్యలను ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ నాయకులు పాంగి శ్రీను, పాంగి కుమారి, సీదరి సత్తిబాబు, ఎం.చిట్టిబాబు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళిక

చింతపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామనా స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. మంగళవారం పంచాయతీలో గ్రామ సభ జరిగింది. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ ప్రజలకు సీపీడబ్ల్యూ పథకం ద్వారా నీటి సరఫరా చేస్తున్నామన్నారు. ఈ పథకం బావులు ఎండిపోవడం వల్ల నీటి సరఫరాకు ఇబ్బంది కలుగుతుందన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామన్నారు. పలు వీధుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నామన్నారు. విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి కుటుంబానికి తడి, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేసినట్టు వివరించారు. ప్రజలు చెత్తను వీధులు, గృహ పరిసరాల్లో పడేయకుండగా ఈ బుట్టల్లో వేసి పంచాయతీ సిబ్బందికి అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

దశలవారీగా తాగునీటి సమస్యకు పరిష్కారం

ముంచంగిపుట్టు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుజనకోట పంచాయతీ పరిధి గ్రామాల్లో దశలవారీగా తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు స్థానిక సర్పంచి వి.రమేశ్ అన్నారు. మంగళవారం ఆయన ఆ పంచాయతీ పరిధిలో నర్సీపుట్టు గ్రామంలో బోరు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ నిధులు ద్వారా బోరు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. జడ్పీ, ఎంపీపీ నిధులు వెచ్చించి మరిన్ని గ్రామాల్లో తాగునీటి పథకాలు ఏర్పాటు, సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్టు చెప్పారు. పలువురు వార్డులు సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గిరిజనులకు ఆయుర్వేద వైద్యం

» ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు


రోగులను పరీక్షిస్తున్న ఆయుర్వేద వైద్యులు

చింతపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు ఆయుర్వేదం ద్వారా మెరుగైన చికిత్స అందిస్తున్నట్టు విజయవాడ ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ అసిస్టెంట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం మండలంలోని అంతర్ల గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 259మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌చార్జి మాట్లాడుతూ.. కేంద్రంలోని కేంద్రీయ ఆయుర్వేద విజ్ఞాన పరిశోధన పరిషత్ ఆయుష్ మంత్రిత్వశాఖ , గిరిజన ఆరోగ్య సంరక్షణ పరిశోధన ప్రాజెక్టు (గిరిజన ఉప ప్రణాళిక) ద్వారా మండలంలోని లంబసింగి, అంతర్ల, కొలపరి, వంగసార, అన్నవరం, మేడూరు, బయలుకించంగి గ్రామాల్లో ప్రతినెలా 7 తేదీన ఆయుర్వేద ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీర్ఘకాల రోగాలతోపాటూ ఇతర వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మెరుగైన చికిత్స అందిస్తున్నామన్నారు. రోగులు ఈశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈశిబిరంలో ఆయుర్వేద వైద్యాధికారులు డాక్టర్ కె. నిశాంత్, డాక్టర్ సుజాత, డాక్టర్ అనుమోల్ పాల్గొన్నారు.

ట్రైబల్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్‌కు సత్కారం


ట్రైబల్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాసులును సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, కూటమి నేతలు

పాడేరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి తొలిసారిగా మంగళవారం విచ్చేసిన ట్రైబల్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాసులుకు కూటమి నేతలు ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఆయనకు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, ట్రైబల్ కార్పొరేషన్ డైరెక్టర్లు కూడ కృష్ణారావు, జీసీసీ డైరెక్టర్లు బొర్రా నాగరాజు, పాంగి రాజారావు, టీడీపీ నేతలు పాండురంగస్వామి, బాకూరు వెంకరమణరాజు, కొమ్మా రమా, డప్పోడి వెంకటరమణ, జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా ఉపాధ్యక్షురాలు కిట్లంగి పద్మ, పాడేరు నియోజకవర్గం అధికార ప్రతినిధి బొంకుల దివ్యలత, కూటమి నేతలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అలాగే, స్థానిక మోదకొండమ్మ ఆలయంలో అమ్మవారి చిత్రపటాలను బహూకరించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మోదకొండమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, ఎంపీపీ ఎస్.రత్నకుమారి, మాజీ ఎంపీపీ ఎస్వీ.రమణమూర్తి, టీడీపీ నేతలు బుక్కా జగదీశ్, అల్లంగి సుబ్బలక్ష్మి, శశిభూషణ్, అచ్చిబాబు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చట్రాపల్లి బాధితులకు గృహాలు నిర్మించాలి


బాధిత కుటుంబాలకు నగదు అందజేస్తున్న మాజీ మంత్రి బాలరాజు

గూడెంకొత్తవీధి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి చట్రాపల్లిలోని వరద బాధితులకు ప్రభుత్వం పక్కా గృహాలు నిర్మించాలని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం చట్రాపల్లి సందర్శించిన మాజీ మంత్రి విరాళాల ద్వారా సేకరించిన రూ.55 వేలను బాధిత గిరిజన కుటుంబాలకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 8తేదీ అర్థరాత్రి చట్రాపల్లి గ్రామంపై కొండచరియలు విరుచుకుపడి ఓ మహిళ మృతి చెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారన్నారు. ఆరు కుటుంబాలు గృహాలను వరదలో కొట్టుకుపోయాయని, 37 కుటుంబాల గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. గృహాలు కోల్పోయిన గిరిజనులు చిన్న పాకలను నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. గ్రామానికి రహదారి సదుపాయం కల్పించాలన్నారు. వరద వల్ల పంట పొలాల్లో పేరుకుపోయిన మట్టిమేటలు ఉపాధి పథకం ద్వారా తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో గాలికొండ సర్పంచ్ కాకూరు బుజ్జిబాబు, ఎంపీటీసీ సభ్యుడు బుజ్జిబాబు, కూటమి నాయకులు పండ్ర చిన్న, గెమ్మెలి చంద్రరావు, కోఆప్టెడ్ సభ్యుడు షేక్ దావీద్ పాల్గొన్నారు.

రూ. 6.5 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం: ఎంపీపీ


భూమి పూజ చేస్తున్న ఎంపీపీ అనుష దేవి, జడ్పీటీసీ బాలయ్య

చింతపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం మార్కెట్ వీధిలో రూ.6.5లక్షల జిల్లా పరిషత్ నిధులతో డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నట్టు స్థానిక ఎంపీపీ కోరాబు అనుష దేవి అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యతో కలిసి ఈ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో జడ్పీ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు ధారలక్ష్మి పద్మ, కోఆప్షన్ సభ్యుడు నాజర్ వల్లి, మాజీ వైస్ ఎంపీపీ బూసరి కృష్ణ పాల్గొన్నారు.

'విద్యుదాఘాతం ఘటనపై విచారణ చేపట్టాలి'

పాడేరురూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెదబయలు మండలం కిముడుపల్లి పంచాయతీ గడుగుపల్లిలో సోమవారం జరిగినవిద్యుదాఘాతం ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి మృతుల కుటుంబానికి ప్రభుత్వం రూ. 30 లక్షల నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. గడుగుపల్లిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృత్యువాత పడటం అత్యంత బాధాకరమన్నారు. ఈఘటనలో తల్లి లక్ష్మి (32)తో పాటు ఇద్దరు పిల్లలు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ శాఖాధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

గడుగుపల్లిలో సోమవారం విద్యుత్ షాక్‌కు గురై ముగ్గురు మృతి చెందిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గిరిజన సంఘం జిల్లా నాయకులు పాలికి లక్కు డిమాండ్ చేశారు. ఈఘటన విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి మృతుల కుటుంబానికి రూ. 20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.



పాడి రైతుకు పశువుల మందులను పంపిణీ చేస్తున్న అధికారులు

పశు పోషణలో యాజమాన్య పద్ధతులు అవసరం

▸▸ పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి రామ్మోహనరావు

తుమ్మపాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పశు పోషణలో పాడి రైతులు యాజమాన్య పద్ధతులను అవలంబించాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ రామ్మోహనరావు చెప్పారు. చినమాకవరం గ్రామంలో మంగళవారం గర్భకోశ చికిత్సా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాడి రైతులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లేగదూడల పెంపకం, పశువులకు సంక్రమించే వ్యాధుల లక్షణాలు, నివారణ చర్యలపై పాడి రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. పశువైద్య శిబిరంలో 56 పశువులకు గర్భకోశ చికిత్సలు, 18 పశువులకు చూడి నిర్ధారణ పరీక్షలు, 40 పెయ్యిలకు నట్టల మందులు అందించినట్టు మండల పశు వైద్యాధికారి అనిల్‌కుమార్ చెప్పారు. పశు వ్యాధుల నివారణ మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పశు వైద్యులు సౌజన్య, రామారావు, భానుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మూలపేటలో టాస్క్‌ఫోర్స్ బృందం పర్యటన



మూలపేట గ్రామంలో పర్యటిస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం

కొత్తూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సత్యనారాయణపురం పంచాయతీ-2 మూలపేటలో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం మంగళవారం పర్యటించింది. డాక్టర్ లూసి కార్డిలియా ఆరోగ్య కేంద్రంలోకి వెళ్లి రికార్డులను పరిశీలించారు. గర్భిణులకు, కిశోర బాలికలకు ఆరోగ్య సిబ్బంది చేస్తున్న పరీక్షలు, చికిత్సలను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య, ఆరోగ్య సేవలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీపీవో జగదీశ్, పీహెచ్‌సి వైద్యాధికారి తిరుపతిరావు, హెచ్‌ఈవో సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత


డీఎస్ఎన్ఎల్‌యూ ఉప కులపతి ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు

సబ్బవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల పరిరక్షణ బాధ్యత అందరిపైనా ఉందని సబ్బవరం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు పేర్కొన్నారు. వర్సిటీలో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరుల సామాజిక, ఆర్థిక హక్కులకు రాజ్యాంగం పూర్తి రక్షణ కల్పించిందని, వీటిని రక్షించడం ప్రభుత్వాల విధి అని చెప్పారు. ప్రతీ వ్యక్తి గౌరవం, స్వేచ్ఛ, సమానత్వానికి అర్హులని, వీటిని గురించి అందరూ తెలుసుకోవాలని సూచించారు. అంతకు ముందు వర్సిటీ అధ్యాపకలు ప్రొఫెసర్ నందినీ, డాక్టర్ దయానందమూర్తి, నాగేశ్వరరావు, డాక్టర్ లక్ష్మి మానవ హక్కులపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పైలాకు ఘన నివాళులు



మాజీ ఎమ్మెల్యే పైలా విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యేలు, నేతల నివాళులు

పరవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పరవాడ మాజీ ఎమ్మెల్యే పైలా అప్పలనాయుడుకు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు.సంతబయలు వద్ద పైలా కాంస్య విగ్రహానికి మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి శ్రీనివాస్, జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరవాడ ప్రాంత అభివృద్ధికి పైలా చేసిన కృషిని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బొడ్డేడ ప్రసాద్, నాయకులు పైలా అప్పారావు, చుక్క రాము నాయుడు, కోటాన రాము, గండి రవికుమార్, కోన రామారావు, బి.నాగేశ్వర రావు, వి.సన్యాసిరావు, గొర్లె గోపి, బొండా కనకారావు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

▸▸ తహసీల్దార్ బి.చిన్నికృష్ణ



వంగలి సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ చెప్పారు. మండలంలోని వంగలి గ్రామంలో మగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ భూములకు సంబంధించిన అన్ని సమస్యలు నిర్దేశించిన సమయంలో పరిష్కరిస్తామని చెప్పారు. గ్రామంలో 2222 ఖాతాలు ఉండగా 2718.14 ఎకరలా భూమి ఉందన్నారు. ఇందులో ప్రభుత్వ భూమి 2718.14 ఎకరాలు, జిరాయితీ 1315.63 ఎకరాలు ఉందన్నారు. ఈ సదస్సులో రైతుల నుంచి తొమ్మిది అర్జీలు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ ఎల్.అప్పారావు, ఆర్‌ఐ వీరయ్య, డీటీ గణపతిరావు, సర్పంచ్ ఆకుల శ్రీహేమ, ఎంపీటీసీ సభ్యులు గవర తులసీ, జీవీఎంసీ 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు, అధికారులు రవి, గోవిందరావు, రాంబాబు, కామరాజు, ఈశ్వరరావు, ఇందిర, హరి, మౌనిష, వసంత, గ్రామ నేతలు ఎ.గణేశ్, గవర రాజు పాల్గొన్నారు.

బొజ్జన్నకొండ మార్గం.. ప్రమాదకరం!

ఆధునిక సమాజంలో జీవనం ఉరుకులు పరుగులైపోయింది. ఇది మనిషి స్థిరత్వానికి భంగం కలిగిస్తోంది. తద్వారా సమస్త రోగాలకు కారణమైన ఒత్తిడిని దరి చేరుస్తోంది. ఈ క్రమంలో ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండకు వెళ్లి ఒక్కసారి బుద్ధుని ఆనవాళ్లను తిలకిస్తే ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తోంది. అందుకే బౌద్ధ క్షేత్రానికి పర్యాటకుల తాకిడి ఎప్పుడూ ఉంటోంది. ఇంతవరకు బాగానే ఉన్నా, బొజ్జన్నకొండకు వెళ్లే మార్గం పర్యాటకులు, వాహన చోదకులను భయపెడుతోంది. రహదారికి ఆనుకుని ఏలేరు కాలువ ఉండడం.. దానికి ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడం.. తరచూ ప్రమాదాలు జరుగుతుండడం.. వెరసి అందర్నీ కలవరపరుస్తోంది.

- ▸▸ రహదారికి ఆనుకుని ఏలేరు కాలువ
- ▸▸ ఇరువైపులా రక్షణ గోడ నిర్మించని వైనం
- ▸▸ భారీ వాహనాలను తప్పించే క్రమంలో బోల్తా
- ▸▸ తరచూ ప్రమాదాలు.. పట్టని అధికారులు
- ▸▸ పర్యాటకులు, వాహన చోదకుల బెంబేలు



రహదారిలోని ఏలేరు కాలువకు ఇరువైపులా నిర్మించని రక్షణ గోడలు



తుమ్మపాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి మండలంలోని బొజ్జన్నకొండకు వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఏలేరు కాలువకు ఆనుకుని ఉన్న ఈ రహదారికి రక్షణ గోడ లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. తుమ్మపాల నుంచి బొజ్జన్నకొండకు, జాతీయ రహదారికి చేరుకోవడానికి ఈ మార్గమే ప్రధానం. అధ్వానంగా ఉన్న ఈ రహదారిని ఇటీవల పూర్తిస్థాయిలో నిర్మించడంతో రాకపోకలు పెరిగాయి. దీంతో పాటు భారీ వాహనాలు పట్టణంలో నుంచి వెళ్లడానికి అనుమతులు లేకపోవడంతో ఈ రోడ్డులోనే వెళ్తూ జాతీయ రహదారికి చేరుకుంటున్నాయి. అతి ప్రధానంగా బొజ్జన్నకొండ సదర్శనకు వెళ్లే పర్యాటకులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగించాలి.

అయితే ఈ రహదారి ఏలేరు కాలువకు ఆనుకుని ఉండడంతో రోడ్డుకు రక్షణ గోడలు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. భారీ వాహనాలు అతి వేగంగా రాకపోకలు సాగిస్తుండడంతో ద్విచక్ర వాహనదారులు భారీ వాహనాలను తప్పించే క్రమంలో అదుపుతప్పి ఏలేరు కాలువలోకి బోల్తాపడుతున్నారు. గతంలో భారీ వాహనాలు సైతం ఏలేరు కాలువలో పడి పలువురు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. బొజ్జన్నకొండపైన బౌద్ధ క్షేత్రానికి ఎప్పుడూ పర్యాటకులు వస్తుంటారు.పిక్నిక్ సీజన్‌లో రద్దీ మరింత పెరుగుతోంది. ఈ క్రమంలో భారీ వాహనాలతో పాటు ద్విచక్ర వాహనదారుల ప్రయాణాలు భారీగా పెరిగాయి. దీంతో ప్రతి రోజూ అడపాదడపా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక చీకటి పడిందంటే ఈ రోడ్డులో ప్రయాణిస్తున్న వారు రోడ్డుకు ఏలేరు కాలువను గుర్తించక నేరుగా ఏలేరు కాలువలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో రక్షణ గోడలకు సంబంధించి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు పలువురు విన్నవించినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బొజ్జన్నకొండ-ఏలేరు కాలువ మధ్య రక్షణ గోడ నిర్మించి ప్రమాదాలను అరికట్టాలని పర్యాటకులు, వాహన చోదకులు వేడుకుంటున్నారు.

వెలమ కులస్థులకు అన్ని విధాలా ప్రాధాన్యం

రాష్ట్ర వెలమ సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్ పీవీజీ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న వెలమ సంక్షేమ సంస్థ చైర్మన్ కుమార్

కొత్తూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెలమ కులస్థులకు అన్ని విధాలా సీఎం చంద్రబాబునాయుడు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆంధ్రప్రదేశ్ కొప్పల వెలమ సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్ పీవీజీ కుమార్ చెప్పారు. అనకాపల్లి పట్టణంలోని గాంధీనగరం వెలమ భవన్‌లో మంగళవారం వెలమ సంక్షేమ సంఘం అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వెలమ కులస్థులకు కూటమి ప్రభుత్వంలో తగిన గుర్తింపు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఇందులో భాగంగానే వెలమలకు కేంద్ర క్యాబినెట్, రాష్ట్ర మంత్రి, శాసన సభ స్పీకర్ తదితర పదవులు ఇచ్చి గౌరవించారన్నారు. అలాగే గత ఎన్నికల్లో పార్టీ కోసం త్యాగం చేసిన వారికి పదవులను ఇచ్చారని తెలిపారు. తనకు పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లతో పాటు సహకరించిన ఎంపీ సీఎం రమేష్, జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి కొప్పల వెలమ కులస్థుల సంక్షేమానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. అనంతరం పీవీజీ కుమార్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు కూండ్రపు భీమ, లాలం కన్నాజీ, గౌరవ అధ్యక్షులు రాజాన అప్పారావు, వాసిరెడ్డి బాలకృష్ణ, రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉత్సాహంగా టీడీపీ సభ్యత్వ నమోదు

▸▸ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్



సింగవరంలోని సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న దాడి రత్నాకర్

కశింకోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఉత్సాహంగా జరుగుతున్నదని పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ చెప్పారు. శింగవరం, గోకువానిపాలెం, తీడ గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. ఎన్టీఆర్ పార్టీ స్థాపించినప్పటి నుంచి కార్యకర్తల శ్రేయస్సుకు కృషి చేశారన్నారు. సభ్యత్వ నమోదు చేసుకోవడం వల్ల రూ.5 లక్షల ప్రమాద బీమా అందజేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. సీఎం చంద్రబాబునాయుడు కార్యకర్తల శ్రేయస్సు నిమిత్తం రూ.2 లక్షలు, ప్రమాద బీమాను రూ.5 లక్షలకు చేశారన్నారు. ఇప్పటి వరకు రూ.60 లక్షలకు పైగా కార్యకర్తలు తమ పేర్లను నమోదు చేసుకున్నారని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నిమ్మదల సన్యాసినాయుడు, డి.సత్తిబాబు, దాసరి బాబు, వేగి దొరబాబు, కొయిలాడ నాగు, హెచ్.సత్తిబాబు, నానిబాబు, లోవకృష్ణ, మహారాజ్, సన్యాసినాయుడు, వినోద్, చైతన్య, దుర్గాప్రసాద్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక గ్రంథాలతో ప్రచారం

పరవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసం పురస్కరించుకుని ఆచార్య ప్రబోధానందయోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలతో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ప్రబోధసేవా సమితి, ఇందూజ్ఞాన వేదిక విశాఖ కమిటీ ఆధ్వర్యంలో ఈ ప్రచారం కొనసాగింది. మార్గశిర మాసంలో ప్రతి ఒక్కరూ భక్తి ప్రవత్తులతో మెలగాలని కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మనిషి సన్మార్గం పయనించినప్పుడే మోక్షం పొందుతారని తెలిపారు. భగవద్గీత సారాంశాన్ని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రమణ, దేవి, నాగమణి, మహా, సత్యవతి, లక్ష్మి, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి అమ్మవారి వెండి రథాన్ని ప్రారంభించిన టీజీ వెంకటేశ్



వెండి రథాన్ని ప్రారంభిస్తున్న టీజీ వెంకటేశ్

కొత్తూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలోని ప్రసిద్ధి చెందిన కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి ప్రతిష్ఠ శత జయంతి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నూతనంగా 100 కిలోల వెండితో తయారు చేసిన రథాన్ని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం వాసవీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ శత జయంతి ఉత్సవాల్లో తనకు కూడా పాల్గొనే అవకాశం ఇచ్చిన ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. పేద ఆర్య వైశ్యులకు కూడా రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు దేవస్థానం కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలికా వికాసానికి కృషిచేయాలి



శిక్షణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎంపీడీవో పద్మజ

సబ్బవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాలికా వికాసానికి కృషి చేయాలని ఎంపీడీవో పి.పద్మజ సూచించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో కిశోర బాలికల వికాసంపై మంగళవారం జరిగిన మండల స్థాయి శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తల్లి ఆరోగ్యంగా ఉండాలంటే యవ్వనంలో బలమైన ఆహారం తీసుకోవాలన్నారు. బాలికా విద్యపై దృష్టిసారించాలని, బడి మానేసిన బాలికలందరనీ బడిలో చేర్పించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె కోరారు. బాలికా ఆరోగ్యంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. అత్యాచారాల నిరోధంపై బాలికల్లో నైతిక స్థైర్యం నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో లలితకుమారి, వెలుగు ఏపీఎం సీహెచ్.శ్రీనివాసరావు, హెల్త్ ఆఫీసర్ స్వర్ణకుమారి, ఎంఈవో ఎంజె రవీంద్రబాబు, వెలుగు, ఐసీడీఎస్, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారుల ప్రతిభ



పోటీల్లో ప్రతిభ చాటిన ఏపీ విద్యార్థులు

సబ్బవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు నేతాజీ ఇంగ్లీషు మీడియం నార్సల్ ఉన్నత పాఠశాలలో జరిగిన 43వ జాతీయ స్థాయి పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి 15 జట్లు పాల్గొన్నాయి. సబ్ జూనియర్ విభాగం మహిళల విభాగంలో ఏపీ జట్టు ప్రథమ, విదర్భ ద్వితీయ, తమిళనాడు మూడో స్థానాల్లో నిలిచాయి. పురుషుల విభాగంలో విదర్భ ప్రథమ, ఏపీ ద్వితీయ, తెలంగాణ మూడో స్థానం సాధించాయి. పురుషుల జూనియర్ విభాగంలో విదర్భం ప్రథమ, ఏపీ ద్వితీయ, తెలంగాణ తృతీయ, జూనియర్స్ స్త్రీల విభాగంలో ఏపీ ప్రథమ, విదర్భ ద్వితీయ, తమిళనాడు తృతీయ స్థానాల్లో నిలిచాయని షూటింగ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ తెలిపారు.

తానాంలో రెవెన్యూ గ్రామ సదస్సు

పరవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తానాం గ్రామంలో మంగళవారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి, హౌసింగ్ పీడీ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ అపరిష్కృత సమస్యలు పరిష్కరించుకునేందుకు ఇది చక్కటి వేదిక అన్నారు. సమస్యపై దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత సమయానికి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సులో తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్, జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు, మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, సర్పంచ్ కన్నూరు దేవి, ఎంపీటీసీ సభ్యురాలు రొంగలి సునీత, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, ఆర్‌ఐ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంరక్షణపై అవగాహన

తుమ్మపాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కిశోర బాలిక వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఇతరులపై ఆధారపడకుండా స్వయం శక్తితో ముందుకు సాగేలా ప్రణాళిక చేసుకోవాలన్నారు. మహిళల చట్టాలపై సైతం అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రముఖ న్యాయవాది కుసుమ మాట్లాడుతూ బాల్య వివాహాల చట్టం, పోక్సో చట్టం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కేవీ నరసింహరావు, ఎస్వీడీఎస్ ప్రతినిధి చైతన్య, సీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి చిన్నారావు, ఐసీడీఎస్ సిబ్బంది మనోహర్, శారదా, శశికళ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

తుమ్మపాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని పట్టణ ఎస్‌ఐ కె.సంతోశ్ సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో మంగళవారం విద్యార్థులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే సైబర్ క్రైమ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. చట్టాలు-ఫలాలపై క్షేత్రస్థాయిలో అవగాహన అవసరమన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీఎస్ సిబ్బంది శివ, స్కూల్ ప్రిన్సిపాల్ భానుశ్రీ పాల్గొన్నారు.

పోరాట క్రీడల్లో బాలభారతి విద్యార్థుల ప్రతిభ

పరవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): థాంగ్-తా అసోసియేషన్ ఆధ్వర్యంలో అచ్యుతాపురంలో ఇటీవల నిర్వహించిన థాంగ్-తా పోరాట క్రీడల్లో సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలినగర్‌కు చెందిన బాలభారతి పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. విద్యార్థులు డి.ధన హర్షిణి, కె.సాయిరాగిణి, అశ్విన్ అనీశ్ స్వర్ణ పతకాలు, సమీక్షసాహు, జె.రిషిక, చేతన్‌సాయి రజత పతకాలు, సాయి నారాయణ కాంస్య పతకాలు సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ వాసంతిదేవి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో మంగళవారం పతకాలు సాధించిన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయుడు షెల్టన్‌జేమ్స్‌తో కలిసి ప్రిన్సిపాల్ జరిగిన అభినందించారు.

12 కిలోల గంజాయి పట్టివేత

కొత్తూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలోని గూడ్స్ రోడ్డు కూడలి వద్ద ఆటోలో తరలిస్తున్న 12 కిలోల గంజాయిని పట్టుకున్నామని సీఐ టీవీ.విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం తమకు వచ్చిన సమాచారం మేరకు పట్టణంలో మాటువేయగా హుకుంపేట నుంచి గంజాయిని తెస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన అరవింద్, పి.సంజీవన్‌మోహన్‌లను అదుపులోకి తీసుకొని అరెస్టు చేశామని తెలిపారు. అంతేకాకుండా హుకుంపేటకు చెందిన పాంగి కేశవ రావు, సీదరి గాసన్న, సీదరి మురళీ పైలట్‌లుగా వ్యవహరించారని, వీరిని కూడా అరెస్టు చేశామని తెలిపారు. అలాగే ఆటోను, ఒక పల్సర్‌బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల జీతాలు చెల్లించాలి

▸▸ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నేత సత్యనారాయణ

పరవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం తక్షణమే జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో మంగళవారం పారిశుధ్య కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు నెలలుగా కార్మికులకు జీతాలు చెల్లించకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల ప్రమాదవశాత్తూ మరణిస్తే ఆ కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. వారికి ఉద్యోగ భద్రత కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా అమలు చేయడంతో పాటు గుర్తింపు కార్డులు, యూనిఫారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల ప్రతినిధులు పి.రామలక్ష్మి, ఎ.ముత్యాలమ్మ, బి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సకల కళా ధీరజుడు


ఇండియా బుక్ ఆఫ్ రికార్డు అవార్డుతో ధీరజ్ (ఫైల్)

- చిన్న వయస్సులో మంచి గాయకుడిగా పేరు ప్రఖ్యాతలు
- నిర్విరామంగా 77 సార్లు వందేమాతరం ఆలపించి రికార్డు
- చిత్ర లేఖనంలోనూ దిట్ట
- ఫొటోగ్రఫీలోనూ ప్రతిభ

(నర్సీపట్నం- ఆంధ్రజ్యోతి)

తోటి పిల్లలతో ఆడుకోవాల్సిన వయస్సులో ఆ బాలుడు రికార్డులు సాధిస్తున్నాడు. సంగీతం, చిత్రలేఖనం, ఫొటోగ్రఫీలో బహుమతులు సొంతం చేసుకుంటున్నాడు. పాడుతా తీయగా పాటల పోటీల్లో విజేతగా నిలిచాడు. పిట్ట కొంచెం.. కూత ఘనం అన్నట్టు నర్సీపట్నానికి చెందిన దొంతంశెట్టి ధీరజ్ బహుముఖ ప్రజ్ఞతో అందరి మన్ననలు పొందుతున్నాడు.

నర్సీపట్నంలోని ఓ ప్రైవేటు స్కూల్లో ధీరజ్ పదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు దొంతంశెట్టి రాజేశ్, రాణి చిన్నతనం నుంచి ధీరజ్‌ను ప్రోత్సహించారు. డాక్టర్ గుమ్మలూరి శారద సుబ్రహ్మణ్యం వద్ద శాస్త్రీయ సంగీతం నేర్పించారు. మూడేళ్ల ప్రాయం నుంచి ధీరజ్ సంకీర్తనలు ఆలపించేవాడు. ఎనిమిదేళ్ల వయస్సులో 2018లో పాడుతా తీయగా పాటల పోటీలో ప్రథమ విజేతగా నిలిచాడు. సినీ దర్శకుడు కె.విశ్వనాథ్, గాన గంధర్వుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా రూ.2 లక్షలు నగదు, ట్రోఫీ అందుకున్నాడు. తిరుమల తిరుపతి దేవస్థానం ఎస్వీబీసీ చానల్ నిర్వహించిన అన్నమయ్య పాటకు పట్టాభిషేకంలో గీతాలు ఆలపించి ఆస్కార్ విజేత, సినీ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, దర్శకుడు కె. రాఘవేంద్రరావు, గాయని సునీత మన్ననలు పొందాడు. 2019లో శ్రీకాకుళంలో జరిగిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సంగీత విభావరిలో ప్రముఖ గాయని ఎస్పీ శైలజతో కలిసి 'నల్ల నల్లని మబ్బులోన' అనే యుగళ గీతాన్ని ఆలపించాడు. నర్సీపట్నం సత్యసాయి మందిరంలో సంపూర్ణ వందేమాతరం గీతాన్ని ఐదు గంటల పాటు 77 సార్లు నిర్విరామంగా పాడి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. పౌరాణిక పద్యాలు, శాస్త్రీయ సంగీతం, హిందూస్థానీ సంగీతం, గజల్స్ పాడడం ధీరజ్ కు కొట్టిన పిండి. 18 భాషల్లో పాటలు పాడగడని అతని తండ్రి రాజేశ్ చెప్పారు. సంగీతంలో ధీరజ్ చూపుతున్న ప్రతిభకు ప్రముఖుల నుంచి పురస్కారాలు, లెక్కలేనన్ని బహుమతులు అతని సొంతమయ్యాయి.


ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో ధీరజ్ (ఫైల్)

చిత్రలేఖనంలోనూ దిట్ట

ధీరజ్ చదువు కొనసాగిస్తూ అవకాశం దొరికినప్పుడు పాటల పోటీలో పాల్గొంటున్నాడు. వీలు కుదిరినప్పుడు చిత్రలేఖనం లోనూ ప్రతిభ కనబరుస్తున్నాడు. చిన్న చిన్న గులక రాళ్లతో (స్టోన్ ఆర్ట్), చాక్ పీస్‌ల పైన కళాకృతులు చెక్కడంలో సిద్ధహస్తుడు. గూగుల్ ఫర్ డూడిల్ 2019లో జాతీయ స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో టాప్ 20 స్థానంలో నిలిచి న్యూ ఢిల్లీలో ఆ సంస్థ ప్రతినిధులు చేతుల మీదుగా బహుమతి అందుకున్నాడు. ధీరజ్ గీసిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం బొమ్మ అమెరికా న్యూజెర్సీ తెలుగు వెలుగు సావనీర్- 2024లో ప్రచురించారు. 2023 టయోటా కార్ జాతీయ డ్రాయింగ్ పోటీలో రూ.5వేలు నగదు పురస్కారం అందుకున్నాడు.

ఫొటోగ్రఫీలోనూ ప్రతిభ

గత ఏడాది జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆ బాలుడు తీసిన చిత్రాలతో నర్సీపట్నం వాసవీ క్లబ్‌లో ప్రదర్శన ఏర్పాటు చేశాడు. డెహ్రాడూన్‌లోని సంకల్పతరు సంస్థ నిర్వహించిన ప్రకృతి అంశంపై జాతీయ స్థాయి పోటీలో బహుమతి సాధించాడు. పర్యావరణం, పక్షుల మీద మక్కువతో గత మూడేళ్లుగా వేలాది మొక్కలు నాటాడు. చాలా మందికి పిచ్చుకల గూళ్లు చేశాడు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి కలిసిపాడుదాం- వందే మాతరం గీతం కార్యక్రమం నిర్వహించి, మొక్కలు నాటుతుంటాడు.



గూగుల్ నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో బహుమతి అందుకుంటున్న దృశ్యం(ఫైల్)

14న జాతీయ లోక్ అదాలత్

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని అన్ని న్యాయస్థానాల్లో ఈ నెల 14న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం జరుగుతుందని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయస్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్‌బౌన్స్, బ్యాంకింగ్, మోటారు ప్రమాదాల నష్టపరిహారం కేసులు, ల్యాండ్ అక్విజేషన్, మనీ రికవరీ, కార్మిక, పారిశ్రామిక వివాదాలు, కుటుంబ తగాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు తదితరాలు పరిష్కారానికి వస్తాయని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


ఎరువుల దుకాణంలో స్టాకును పరిశీలిస్తున్న నర్సీపట్నం వ్యవసాయ అధికారులు

ఎస్.రాయవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డరోడ్డులో ఉన్న ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ నర్సీపట్నం ఏడీ టి.శ్రీదేవి, మండల ఏవో సౌజన్యతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఎరువుల నిల్వలను పరిశీలించి, కొన్ని బస్తాలను తూకం వేయించారు. పురుగుల మందుల డబ్బాలపై ఉన్న బ్యాచ్ నంబర్లు, తేదీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ శ్రీదేవి మాట్లాడుతూ, గడువు ముగిసిన ఎరువులు, పురుగు మందులు విక్రయించవద్దని, ఎక్స్‌పైరీ డేట్‌ను పరిశీలించిన తరువాతే రైతులకు అమ్మాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని స్పష్టం చేశారు.

కోత ప్రయోగాలే పంట దిగుబడులకు ప్రామాణికం

- డీసీపీవో జి.రామారావు


మొగలిపురంలో పంట కోత ప్రయోగాల్ని పరిశీలిస్తున్న జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు

సబ్బవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పంట దిగుబడుల లెక్కింపునకు పంట కోత ప్రయోగాలే ప్రామాణికం అని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (డీసీపీవో) జి.రామారావు పేర్కొన్నారు. మండలంలోని మొగలిపురంలో మంగళవారం నిర్వహించిన పంట కోత ప్రయోగాల్ని ఆయన పరిశీలించి పంట దిగుబడిని లెక్కించారు. ఈ సందర్భంగా డీసీపీవో మాట్లాడుతూ, జిల్లాలో వరి పంట దిగుబడి లెక్కింపునకు పంట కోత ప్రయోగాలే ఆధారం అయినందున, దిగుబడి ప్రమాణాల లెక్కింపులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ సహాయకులకు సూచించారు. 25 చదరపు మీటర్ల విస్తీర్ణంలో పంట దిగుబడి గణంకాల ప్రకారం ఎకరాకు 25 బస్తాల (75 కిలోలు) ధాన్యం దిగుబడి వచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ, ఏఎస్‌వో రమాదేవి, ఏఏవోలు రమాదేవి, రాజేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	93.00
లైవ్ ధర	113.00
విత్ స్కిన్	196.00
స్కిన్ లెస్	206.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	618
విజయనగరం	622
శ్రీకాకుళం	622

సామాజిక పింఛన్ల తనిఖీ

ఎలమంచిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా మంజూరు చేసిన సంక్షేమ పథకాలకు సంబంధించి అనర్హుల ఏరివేతకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఎలమంచిలి మండలం పురుషోత్తపురం గ్రామ సచివాలయాన్ని అధికారులు ఎంపిక చేశారు. మంగళవారం ఇంటింటా సర్వే కార్యాక్రమాన్ని ప్రారంభించారు.

గత వైసీపీ ప్రభుత్వం సొంత పార్టీ కార్యకర్తలకు అడ్డగోలుగా సామాజిక పెన్షన్లు, పక్కా ఇళ్లు, స్థలాలు మంజూరు చేసింది. దీంతో ఎంతోమంది అనర్హులు దర్జాగా ప్రభుత్వ పథకాలు పొందుతున్నారు. మరోవైపు ఇతర పార్టీల సానుభూతిపరుల పేర్లను లబ్ధిదారుల జాబితాల నుంచి తొలగించింది. దీనిపై కూటమి ప్రభుత్వానికియ పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. దీంతో అనర్హుల ఏరివేతకు సర్వే చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించింది. పైలట్ ప్రాజెక్టుగా అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలం పురుషోత్తపురం గ్రామ సచివాలయాన్ని ఎంపిక చేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శచీదేవి, డీఎల్‌డీవో ఎస్.మంజులావాణి నేతృత్వంలో ఎంపీడీఓ కేఎస్ కొండలరావు, ఎస్ఓ ప్రసాద్‌లయ ఆధ్వర్యంలో పది బృందాలు పురుషోత్తపురం, కొత్తలి, పేరంటాళ్లపాలెం గ్రామాల్లో పింఛన్ల తనిఖీ చేపట్టారు. మొత్తం 491 మంది పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి పరిశీలించారు.పింఛన్ తీసుకుంటున్న వ్యక్తి వున్నారా? లేదా? కుటుంబ ఆదాయం, వ్యవసాయ భూమి, ఇళ్ల స్థలాలు, వాహనాలు, ప్రైవేటు ఉద్యోగం/ ఉపాధి, విద్యుత్ వినియోగం, వితంతువులు అయితే భర్తకు సంబంధించిన మరణ ధ్రువ పత్రం, దివ్యాంగులు అయితే సదరం ధ్రువపత్రం, ఇతర వృతిదారులైతే వృత్తికిఇ సంబంధించి ధ్రువపత్రాలను పరిశీలించారు. పలు అంశాల గురించి లబ్ధిదారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం 5.30 గంటలకు ఈ ప్రక్రియ ముగిసింది. నివేదికను ప్రభుత్వానికి పంపుతామని డీఆర్‌డీఏ పీడీ తెలిపారు.


పురుషోత్తపురంలో పింఛన్‌దారుల వివరాలు పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, డీఎల్‌డీవో ఎస్.మంజులావాణి

నిల్వ ఆహారం తిన్న విద్యార్థినులకు అస్వస్థత

- మెగా పేరెంట్, టీచర్ మీట్‌లో మిగిలిపోయిన వంటకాలను మరుసటిరోజు వడ్డించిన గురుకులం సిబ్బంది
- వాంతులు, విరేచనాలతో ఎనిమిది మంది ఆస్పత్రిపాలు
- చికిత్స అనంతరం డిశ్చార్జి
- ఆలస్యంగా వెలుగులోకి...


గోమంగి పీహెచ్‌సీలో సోమవారం చికిత్స పొందుతున్న విద్యార్థినులు

పెదబయలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిల్వ ఆహారం తిని మినీ గురుకులం విద్యార్థినులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల ఏడో తేదీన నిర్వహించిన మెగా పేరెంట్- టీచర్ మీట్ కార్యక్రమంలో మిగిలిపోయిన ఆహార పదార్థాలను మరుసటిరోజు విద్యార్థినులకు వడ్డించడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పెదబయలు మండలం గోమంగిలో గల మినీ గురుకులంలో ఈ నెల ఏడో తేదీన మెగా పేరెంట్-టీచర్ మీట్ నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల కోసం వంటలు తయారు చేయించారు. అవి మిగిలిపోవడంతో మరుసటిరోజైన ఆదివారం ఉదయం విద్యార్థినులకు టిఫిన్‌తో పాటు నిల్వ ఉన్న కోడి మాంసం కూరను కూడా వడ్డించారు. అది తిన్న ఎనిమిది మంది విద్యార్థినులకు సోమవారం ఉదయం నుంచి వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. దీంతో సిబ్బంది వారిని పెదబయలు పీహెచ్‌సీకి తరలించారు. డాక్టర్ చైతన్య వారికి చికిత్స అందించారు. 24 గంటల పాటు తన పర్యవేక్షణలో ఉంచి వారి ఆరోగ్యం నిలకడగా ఉండడంతో మంగళవారం ఉదయం డిశ్చార్జి చేశారు. నిల్వ ఆహారం తినడం వల్లే విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని, ప్రస్తుతం వారు ఆరోగ్యంగానే ఉన్నారని డాక్టర్ చైతన్య విలేకరులకు తెలిపారు. మంగళవారం గురుకులానికి వెళ్లి మళ్లీ వారిని పరీక్షించానని చెప్పారు. ఈ సంఘటనపై గురుకులం ప్రత్యేక అధికారి పి.వసంత వివరణ కోరగా, మెగా పేరెంట్-టీచర్ మీట్‌కు ఆశించిన స్థాయిలో విద్యార్థినుల తల్లిదండ్రులు రాకపోవడంతో ఆహార పదార్థాలు మిగిలిపోయిన విషయం వాస్తవమేనని చెప్పారు. అయితే ఆ వంటకాలను పారబోయాలని వంట సిబ్బందికి చెప్పానని తెలిపారు. సోమవారం ఉదయం విద్యార్థినులకు టిఫిన్ తయారు చేయించి, గురుకుల బాధ్యతలను వేరొకరికి అప్పగించి తాను శిక్షణ నిమిత్తం విజయనగరం వెళ్లానన్నారు. విద్యార్థినులకు నిల్వ ఆహారం వడ్డించినట్టు తనకు తెలియదని, ఎనిమిది మంది విద్యార్థినులకు వాంతులు, విరేచనాలు అయినట్టు తనకు ఆలస్యంగా తెలిసిందన్నారు. వెంటనే వారిని పీహెచ్‌సీకి తరలించాల్సిందిగా సిబ్బందిని ఆదేశించినట్టు చెప్పారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు డాక్టర్ ద్వారా తెలుసుకున్నట్టు ఆమె చెప్పారు.

టీడీపీ జోష్

... 5వ పేజీ తరువాయి

స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. మరోవైపు టీడీపీ శ్రేణులు సైతం తమ పరిధిలో వీలేనంత ఎక్కువ మందిని సభ్యులుగా చేర్పించడానికి కృషి చేస్తున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబుతోపాటు పార్టీ ఎమ్మెల్యేలు, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పిస్తుండడంతో ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్నది.

3.5 లక్షల మందిని చేర్పించాలని లక్ష్యం

అనకాపల్లి జిల్లాలో ఈసారి 3.5 లక్షల మందిని సభ్యులుగా చేర్పించాలని టీడీపీ అధిష్ఠానం లక్ష్యాన్ని విధించింది. సోమవారం వరకు 2,45,695 మంది సభ్యత్వాలు పొందారు. ఇంకా నెల రోజులకుపైగా గడువు వుండడంతో లక్ష్యం మేరకు సభ్యత్వ నమోదు పూర్తిచేయడానికి కిందిస్థాయిలో నాయకులు, సీనియర్ కార్యకర్తలు కృషి చేస్తున్నారు.

కార్యకర్తల కుటుంబాలకు భరోసా

తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు గతంలో ప్రమాద బీమా రూ.2 లక్షలు ఉండగా ఇప్పుడు రూ.5 లక్షలకు పెంచారు. అంతేకాక సభ్యులు ఎవరైనా సాధారణ మరణం చెందితే మట్టి ఖర్చుల కింద రూ.10 వేలు పార్టీ నుంచి అందించే ఏర్పాటు చేశారు.

గడువులోగా లక్ష్యాన్ని పూర్తిచేస్తాం

- బత్తుల తాతయ్యబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు



జిల్లాలో టీడీపీ సభ్యత్వ నమోదు వేగంగా సాగుతున్నది. టీడీపీ సభ్యత్వం పొందేందుకు అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. దీంతో గడువులోగా లక్ష్యాన్ని పూర్తిచేస్తామన్న నమ్మకం వుంది. పెందుర్తి నియోజకవర్గంలో సభ్యత్వ నమోదులో కాస్త వెనుకబడిన మాట వాస్తవమే. అక్కడ నియోజకవర్గ ఇన్‌చార్జి, సీనియర్ నాయకులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి సభ్యత్వ నమోదును వేగవంతం చేస్తాం.

అనకాపల్లి సమీపాన హెల్త్ సిటీ

... 5వ పేజీ తరువాయి

నుంచి భీమిలి వరకు తీర ప్రాంతం కోతకు గురికాకుండా రూ.200 కోట్లతో కోస్టల్ ఎరోజిన్ ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించారు. దీనికి అయ్యే వ్యయాన్ని 90:10 నిష్పత్తిలో కేంద్రం, వీఎంఆర్‌డీఏ భరిస్తాయి.

● భోగాపురం విమానాశ్రయానికి వెళ్లే జాతీయ రహదారిని అనుసంధానిస్తూ వివిధ ప్రాంతాల్లో 15 రహదారుల నిర్మాణానికి ఆమోదించారు. వీటికి అవసరమైన నిధులను చినముషిడివాడ, తుమ్మపాలలో వీఎంఆర్‌డీఏ భూముల అమ్మకం ద్వారా సమకూర్చుకోవాలని తీర్మానించారు.

● విశాఖపట్నం సెంట్రల్ పార్కులో మ్యూజికల్ ఫౌంటెన్‌ను 40 నెలలు నిర్వహించడానికి రూ.1.84 కోట్లతో అంచనాలకు ఆమోదం తెలిపారు.

● రుషికొండలో ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో ఢిల్లీ తరహాలో అర్బన్ హ్యాబిటేట్ సెంటర్‌ను పీపీపీ విధానంలో నిర్మించాలని తీర్మానించారు.

క్రైం... crime news

సరుగుడు తోటలో రైతు సజీవ దహనం

- చెత్తకు నిప్పు పెట్టే క్రమంలో ప్రమాదం


చిన్నం నాయుడు (ఫైల్‌ఫొటో)

కశింకోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సరుగుడు తోటలో ఓ రైతు సజీవంగా దహనమయ్యాడు. సరుగుడు తొక్కుకు నిప్పు పెట్టే క్రమంలో మంటలు చుట్టుముట్టడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

తాళ్లపాలెం గ్రామానికి చెందిన తోరం చిన్నం నాయుడు(58)కు ఉగ్గినపాలెంలో సరుగుడు తోట వుంది. ఇటీవల సరుగుడు కర్రలను విక్రయించడంతో పొలంలో చిల్లకొమ్మలు, తొక్కు పేరుకుపోయాయి. వీటిని దహనం చేయడానికి ఆయన మంగళవారం మధ్యాహ్నం పొలానికి వెళ్లాడు. సరుగుడు వ్యర్థాలకు నిప్పుపెట్టిన తరువాత గాలులకు మంటలు చుట్టుముట్టడంతో బయటకు రాలేకపోయాడు. దీంతో సజీవ దహనం అయ్యాడు. ఈ సమయంలో చుట్టుపక్కల పొలాల్లో ఎవరూ లేకపోవడంతో గమనించలేదు. సుమారు గంట తరువాత అటుగా వెళుతున్న రైతులు గమనించి, చిన్నంనాయుడు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ లక్ష్మణరావు, వీఆర్‌వో శ్రీనివాసరావు సందర్శించి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం అనకాపల్లి తరలించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

ఎలమంచిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్లబ్ రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి స్పృహ కోల్పోయి, అనకాపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పట్టణ ఎస్ఐ సావిత్రి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 8వ తేదీన స్థానిక క్లబ్ రోడ్డులో ఒక వ్యక్తి స్పృహకోల్పోయి రోడ్డుపై పడి వున్నాడు. స్థానికులు చూసి 108కు సమాచారం ఇచ్చారు. కొద్దిసేపటి తరువాత అంబులెన్స్‌లో సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పంపారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. ఇతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా పోలీసులు కేసు నమోదు చేశారు. సుమారు 40 ఏళ్ల వయసున్న ఈ వ్యక్తి వివరాలు తెలిసిన వారు పట్టణ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ సావిత్రి కోరారు.

రోడ్డు ప్రమాదంలో విద్యుత్ లైన్‌మన్‌కు గాయాలు

చోడవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బైక్‌పై అతివేగం వచ్చి ఓ యువకుడు ఢీకొనడంతో విద్యుత్ లైన్‌మన్‌కు గాయాలయ్యాయి. ఈ సంఘటన పట్టణ శివారు ద్వారకానగర్ సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మాడుగుల మండలం కేజే పురం విద్యుత్‌శాఖ లైన్‌మన్ సోంబాబు ఈవినింగ్ వాక్‌కు వెళుతున్నాడు. ఇంతలో మండలంలోని లక్కవరానికి చెందిన ఓ యువకుడు బైక్‌పై అతివేగంగా వచ్చి సోంబాబును ఢీకొన్నాడు. దీంతో సోంబాబుకు గాయాలయ్యాయి. బైక్ నడుపుతున్న యువకుడు కూడా గాయపడ్డాడు. వీరిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

వేంపాడు వద్ద కారు బోల్తా


జాతీయ రహదారిపై బోల్తాపడిన కారు

నక్కపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. రాజమహేంద్రవరం నుంచి విశాఖవైపు వెళుతున్న కారు... వేంపాడు వద్ద ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నది. అంతటితో ఆగకుండా అవతలవైపు రోడ్డుపైకి వెళ్లి బోల్తాపడింది. ఈ సమయంలో కారులో నలుగురు ప్రయాణికులు వున్నారు. కారు ధ్వంసమైనప్పటికీ ప్రయాణిస్తున్న వారంతా క్షేమంగా వుండడంతో ఊపిరి పీల్చుకున్నారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సన్నిబాబు చెప్పారు.

ఇసుక అక్రమ రవాణా.. లారీ స్వాధీనం

మునగపాక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న లారీని మంగళవారం పట్టుకున్నట్టు ఎస్.ఐ. పి.ప్రసాదరావు తెలిపారు. తోటాడ పంచాయతీ పరిధిలో ఇసుక లోడుతో వెళుతున్న లారీని ఆపి, రవాణాకు సంబంధించి వివరాలు అడిగామని, ఎటువంటి అనుమతి పత్రాలు చూపకపోవడంతో లారీని స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించామన్నారు. కాగా సదరు లారీ యజమానికి రూ.5 వేలు అపరాధ రుసుం విధించినట్టు డిప్యూటీ తహసీల్దారు శేషుబాబు చెప్పారు.

రెండు కిలోల వెండి ఆభరణాలు చోరీ

ఎలమంచిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామ్మూర్తినగర్ కాలనీలో సోమవారం రాత్రి ఓ ఇంటిలో సుమారు రెండు కిలోల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్టు పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. డి.రమేశ్ అనే వ్యక్తికి రామ్మూర్తినగర్‌లో ఎదురెదురుగా రెండు ఇళ్లు వున్నాయి. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులంతా కలిసి ఒక ఇంటిలో నిద్రించారు. మంగళవారం ఉదయం నిద్ర లేచి చూసేసరికి ఎదురింటి తలుపులు తీసివున్నాయి. ఇంటిలో సుమారు రెండు కిలోల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్టు నిర్ధారించుకుని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఏఎస్ఐ చెల్లారావును వివరణ కోరగా, రెండు కిలోల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్టు ఫిర్యాదు అందినమాట వాస్తవమేనని చెప్పారు.